కర్నూలు బస్సు ప్రమాద ఘటనలో..

ముగ్గురు ఉమ్మడి జిల్లావాసులు

రావులపాలేనికి చెందిన క్రేన్ ఆపరేటర్ మృతి

బిక్కవోలు, కాకినాడకు చెందిన ఇద్దరు సురక్షితం



మృతుడు కొవ్వూరి శ్రీనివాసరెడ్డి (ఫైల్)

రావులపాలెం/ అనపర్తి, అక్టోబరు24 (ఆంధ్రజ్యోతి): కర్నూలులో గురువారం అర్ధరాత్రి జరిగిన కావేరి బస్సు దగ్ధం ఘటనలో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాకు చెందిన ముగ్గురు చిక్కుకున్నారు. వీరిలో ఒకరు మృతి చెందగా, ఇద్దరు సురక్షితంగా బయటపడ్డారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా రావులపాలేనికి చెందిన కొవ్వూరి శ్రీనివాసరెడ్డి(39) క్రేన్ ఆపరేటర్‌గా పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. క్రేన్ పని నిమిత్తం రెండు రోజుల కిందట ఇక్కడి నుంచి హైదరాబాద్ వెళ్లాడు. బెంగళూరులో వేరే పని ఉండడంతో గురువారం రాత్రి కావేరి ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు ఎక్కాడు. ఈ దుర్ఘటనలో శ్రీనివాసరెడ్డి అగ్నికి ఆహుతై మృతి చెందాడు. మృతుడికి భార్య లక్ష్మీజ్యోతి, 8వ తరగతి చదువుతున్న కుమారుడు వెంకటరెడ్డి, 3వ తరగతి చదువుతున్న కుమార్తె దివ్య ఉన్నారు. మృతుడి తండ్రి, మావయ్య కూడా అతడిపైనే ఆధారపడి జీవిస్తున్నారు. ఇదే దుర్ఘటనలో తూర్పుగోదావరి జిల్లా బిక్కవోలు మండలం పందలపాక గ్రామానికి చెందిన మల్లిడి గంగాధర రామారెడ్డి తృటిలో తప్పించుకుని మృత్యుంజయుడిగా నిలిచాడు. అనపర్తిలోని ఎంఎస్ఆర్ విద్యాసంస్థల వ్యవస్థాపకుడు మల్లిడి నారాయణరెడ్డి కుమారుడైన రామారెడ్డి తన కుమార్తె చదువు కోసం బెంగళూరులో ఉంటున్నాడు. ఆయన వ్యాపార రీత్యా బెంగళూరు నుంచి హైదరాబాద్‌కు తరచూ ప్రయాణిస్తుంటాడు. శుక్రవారం తన పుట్టినరోజు కావడంతో ఎట్టిపరిస్థితిలోను బెంగళూరు వెళ్లాలనుకుని గురువారం రాత్రి అప్పటికప్పుడు బస్సు టికెట్ తీసుకుని బయలుదేరాడు. చివరి నిమిషంలో టికెట్ దొరకడంతో ఆఖరి వరుసలో సీటు దొరికింది. చివరికి అదే ఆయన ప్రాణాలు కాపాడింది. పక్క ప్రయాణికులు పగలగొట్టిన ఎమర్జెన్సీ డోరు నుంచి కిందకు దూకి ప్రాణాలు దక్కించుకున్నానని మల్లిడి గంగాధర రామారెడ్డి ఫోన్‌లో ఆంధ్రజ్యోతికి తెలిపారు. ఇదే ఘటనలో బయటపడిన కాకినాడకు చెందిన జి.సత్యనారాయణ ప్రస్తుతం కర్నూలులోని ఆకాశ్ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నట్టు సమాచారం.



మల్లిడి గంగాధర రామారెడ్డి క్షతగాత్రుడు

రాయవరం బాధితులకు చెక్కుల పంపిణీ

- ఆదుకోవడంలో కూటమి ప్రభుత్వం ముందుంటుంది : మంత్రి సుభాష్
- చెక్కులు పంపిణీ చేసిన మంత్రి, ఎమ్మెల్యేలు నల్లమిల్లి, వేగుళ్ల
- మృతుల కుటుంబాలకు ఒక్కొక్కరికి రూ.15 లక్షల పరిహారం
- యజమాని తరపున ఒక్కొక్కరికి 2.50 లక్షల పరిహారమూ అందజేత

6

అన్నదాతలకు అండగా ఉంటాం: మంత్రి సుభాష్

కె.గంగవరం, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): అన్నదాతలను ఆదుకోవడానికి కూటమి ప్రభుత్వం ఎల్లప్పుడూ ముందు ఉంటుందని కార్మికశాఖమంత్రి వాసంశెట్టి సుభాష్ అన్నారు. భారీ వర్షాలకు, గాలులకు జిల్లాలోని పలు మండలాల్లో పంటలు నీటమునిగి నేలమట్టమయ్యాయి. ఈ నేపథ్యంలో శుక్రవారం ఆయన కె.గంగవరం మండలంలోని కుందూరులో పర్యటించారు. రైతులతో మాట్లాడి వారి ఇబ్బందులు తెలుసుకున్నారు. ప్రభుత్వం అండగా ఉంటుందని ధైర్యం చెప్పారు. వ్యవసాయశాఖ అధికారులను పిలిచి పంటనష్టాలపై సమగ్ర నివేదిక ఇవ్వాలని ఆదేశించారు. రామచంద్రపురం నియోజకవర్గంలో 36,511ఎకరాల్లో వరిపంట సాగవగా ప్రాథమిక అంచనా ప్రకారం 2056 ఎకరాల్లో పంటపడిపోయింది. ప్రస్తుతం పంట గింజ గట్టిపడే దశనుంచి పాలు నిండే దశవరకూ ఉంది. దీంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. నివేదిక వచ్చిన తర్వాత ప్రతిరైతుకు న్యాయం చేస్తామని, ప్రతిధాన్యం గింజ కొనుగోలు చేస్తామని మంత్రి హామీఇచ్చారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ అక్కల రిష్వంత్‌రాయ్, జనసేన ఇన్‌చార్జ్ పోలిశెట్టి చంద్రశేఖర్, కుందూరు సొసైటీ అధ్యక్షుడు జగతా వెంకటరమణ, కూటమి నాయకులు మేడిశెట్టి బాబి, మేడిశెట్టి రవికుమార్, పుణ్యమూర్తి కొత్తపల్లి మొరార్జీ, చిర్రా సురేష్ పాల్గొన్నారు.



కుందూరులో వర్షాలకు పడిపోయిన వరి కంకులను పరిశీలిస్తున్న మంత్రి సుభాష్



బాబోయ్.. బస్!

హైదరాబాద్, బెంగళూరు, చెన్నై.. ఎక్కడికైనా వెళ్లాలా? చక్కగా ఆన్‌లైన్ ఓపెన్ చేయగానే ప్రైవేటు ట్రావెల్స్ బస్సుల లిస్టు ప్రత్యక్షమవుతుంది. ప్రయాణికులు ఒక్క క్లిక్‌తో సీటు లేదా బెర్త్ బుక్ చేసేసుకుంటున్నారు. తీరా బస్సు ఎక్కిన తర్వాత ఇరుకు సీట్లు, అటు ఇటు కదిలే చోటుండదు. మధ్యలో ఉన్న దారి కుచించుకుపోయి ఉంటుంది. ఎవరైనా ఒక బ్యాగ్ ఆ దారిలో పెడితే ఇక అంతే.. దానిపై నుంచి దూకాల్సిందే. అత్యవసర ద్వారం ఎక్కడ ఉందో వెతుక్కునే లోపుగా ప్రాణాలు గాల్లో కలిసిపోతాయి. అధికారులు తనిఖీలు చేస్తున్నా.. జనం ప్రాణాలు పోతున్నా ప్రైవేటు ట్రావెల్స్(కాంట్రాక్ట్ క్యారియర్స్) బస్సుల తీరు మాత్రం మారడం లేదు. ఆకర్షణీయమైన రంగులు, హంగులకు ప్రాధాన్యం ఇస్తూ భద్రతను గాలికొదిలేస్తున్నారు. హైదరాబాద్ నుంచి బెంగళూరు వెళుతున్న ప్రైవేటు ట్రావెల్స్ బస్సులో కర్నూలు వద్ద శుక్రవారం మంటలు చెలరేగి పలువురు సజీవదహనమైన సంఘటనతో జనం ఉలిక్కిపడ్డారు. ఒక బైక్ ఢీకొంటే బస్సు మొత్తం తగలబడిపోయేంత నిర్లక్ష్యానికి ఎవరు బాధ్యులని బలైపోయిన ప్రాణాలు మౌనంగా ప్రశ్నిస్తున్నాయి.

- ప్రమాదకరంగా ప్రైవేటు బస్సుల ప్రయాణం
- గాల్లో కలిసిపోతున్న ప్రాణాలు
- నిబంధనలు విస్మరిస్తున్న ట్రావెల్స్ యాజమాన్యాలు
- రికార్డులు పరిశీలించి చేతులు దులుపుకొంటున్న రవాణాశాఖ
- ప్రయాణికుల భద్రత విషయంలో చర్యలు శూన్యం
- రిజిస్ట్రేషన్లు, ఫిట్‌నెస్ ఇతర రాష్ట్రాల్లో..
- అనధికారికంగా స్లీపర్లు ఏర్పాటు
- అనుభవం లేని డ్రైవర్లు

(ఆంధ్రజ్యోతి - రాజమహేంద్రవరం/కాకినాడ/ అమలాపురం)

రైళ్లలో రిజర్వేషన్ దొరకడం గగనమైపోయింది. ఆర్టీసీ ట్రావెల్ బస్సులూ అరకొరే. దీంతో ప్రైవేటు ట్రావెల్ బస్సులే చాలామందికి దిక్కు. పైగా టిక్కెట్ ఆన్‌లైన్ ద్వారా ఒక్క క్లిక్‌తో పొందొచ్చు. ఇదివరకు ప్రైవేటు ట్రావెల్ బస్సులు ఏసీ, నాన్ ఏసీ పేరిట నడిచేవి. అన్నీ సీట్లే. ప్రస్తుతం వాటి స్థానంలో స్లీపర్ కోచ్‌ల హవా నడుస్తోంది. 40 సీట్ల వరకు ఉంటున్నాయి. ఇక స్లీపర్ బస్సుల్లో 2బై1 సీటింగ్ ఉంటుంది. 30 నుంచి 36 బెర్త్‌లు ఉంటాయి. అదే మల్టీయాక్సిల్ బస్సులైతే 36-40 మంది ప్రయాణించవచ్చు. ఒక్కో బెర్త్ ఆరడుగుల పొడవు, 2.6 అడుగుల వెడల్పుతో ఉంటుంది. అయితే బెర్త్‌లను అనుసంధానించే గ్యాలరీ ఒక మనిషి మాత్రమే వెళ్లేలా చాలా ఇరుకుగా ఉంటుంది. ప్రమాదాల సమయంలో ప్రయాణికులు ఈ ఇరుకు ప్రాంతం నుంచి బయటకు రావడం దాదాపు అసాధ్యం. దీనివల్లే ప్రమాదం జరిగినప్పుడు ఎక్కువ మంది లోపల చిక్కుకుపోతున్నారు. స్లీపర్ బస్సుల ఎత్తు కూడా మరో సమస్య. సాధారణంగా వీటి ఎత్తు 8-9 అడుగుల వరకు ఉంటోంది. ఒకవేళ బస్సు ఒకవైపునకు ఒరిగితే ప్రయాణికులు కిటికీలను, ఎమర్జెన్సీ ఎగ్జిట్‌లను చేరడం కష్టమవుతోంది. సాధారణంగా 300 నుంచి వెయ్యి కిలోమీటర్ల దూరం ఉండే ప్రయాణాలకు స్లీపర్ బస్సులను అధికంగా వినియోగిస్తున్నారు. ఈ బస్సుల్లో రాత్రి వేళల్లోనే ఎక్కువగా ప్రయాణిస్తాయి. దీంతో డ్రైవర్‌కు అలసట, మగత వచ్చే ముప్పు కూడా ఎక్కువగా ఉంటుంది. అధునాతన బస్సుల్లో డ్రౌజీనెస్ అలర్ట్ సిస్టమ్‌లను ఏర్పాటు చేస్తున్నా వాటి పనితీరు సామర్థ్యంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. డ్రైవింగ్ సమయంలో అర్ధరాత్రి తర్వాత నుంచి తెల్లవారుజాములోపు కొందరు నిద్రలోకి జారుతున్నారు.

● అంతా ప్రైవేటు బస్సుల హవాయే..

● తూర్పుగోదావరి జిల్లాలో... రోజూ 30 బస్సుల వరకూ ప్రైవేటు ట్రావెల్స్ తిరుగుతున్నాయి. వీటిలో హైదరాబాద్ సర్వీసులు ఎక్కువ. విశాఖ, బెంగళూరు సర్వీసులూ ఉన్నాయి. ఈ ఏడాది ఏప్రిల్ నుంచీ ఇప్పటివరకూ రవాణాశాఖ అధికారులు ప్రైవేటు ట్రావెల్స్ బస్సుల్లో తనిఖీలుచేసి 218 కేసులు రాసి రూ.18 లక్షలు జరిమానా వసూలు చేశారు. ఒక బస్సుకు ఏకంగా రూ.6 లక్షలు ఫైన్ వేశారు. పన్ను చెల్లించ కుండా తిరిగేస్తున్న 9 బస్సులను సీజ్ చేశారు. ఫైర్ ఎగ్జిస్టింగ్విషర్లు లేకపోవడంతో 85, సీట్లు ఆల్ట్రేషన్ చేసినవి 42 కేసులు రాశారు.

● కాకినాడ జిల్లాలో.. హైదరాబాద్, బెంగళూరు, చెన్నై వంటి ప్రాంతాలకు సుమారు 30కిపైగా బస్సులు వెళుతుంటాయి. సీజనల్‌గా వీటి సంఖ్య మారుతుంటుంది. దాదాపుగా ఈ ప్రైవేటు బస్సులన్నీ స్టేజ్ క్యారియర్లుగానే తిరుగుతున్నాయి.

● డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో.. నిత్యం 30కు పైగా బస్సులు హైదరాబాద్, బెంగళూరు ప్రాంతాలకు వెళుతుంటాయి. స్లీపర్‌కు డిమాండ్ పెరగడంతో వారు ఆడింది ఆట, పెట్టిందే రేటుగా దోచుకుంటున్నారు. ట్రావెల్స్ బస్సులు విపరీతమైన వేగంతో నడపడం వల్ల తరచూ ప్రమాదాలు జరిగి చాలామంది ప్రాణాలు కోల్పోతున్నారు.

● ఇతర రాష్ట్రాల్లో రిజిస్ట్రేషన్లు

గతంలో ఏ రాష్ట్రంలోని వాహనాలు అదే రాష్ట్రంలో రిజిస్ట్రేషను చేయించుకోవడం జరిగేది. కేంద్ర ప్రభుత్వం ఆల్ ఇండియా పర్మిట్(ఏఐపీ) వాహనాలు ఏ రాష్ట్రంలోనైనా రిజిస్ట్రేషను చేయించుకోవచ్చని వెసులుబాటు ఇవ్వడంతో అప్పటి నుంచీ నెంబరు ప్లేటుపై ఏపీ తగ్గిపోయి ఏఆర్, డీడీ వంటివి కనిపిస్తున్నాయి. మన రాష్ట్రంలో ఒక్కో సీటుకు రూ.3,750 చొప్పున ప్రతి మూడు నెలలకు ఒకసారి చెల్లించాలి. అంటే 40 సీట్లు ఉన్న బస్సుకు సుమారు రూ.1.50 లక్షలు చెల్లించాలి. అంటే ఏడాదికి రూ.6 లక్షలు. అదే ఈశాన్య రాష్ట్రాలతోపాటు డామన్‌డయ్యూలో అయితే దీనిలో నాలుగో వంతు చెల్లిస్తే సరిపోతుంది. దీంతో ఇతర రాష్ట్రాల్లో పర్మిట్లు తీసుకొని ఇక్కడ తిప్పుతున్నారు. చాలా రాష్ట్రాలు పర్మిట్ ఫీజు తగ్గించినా మన రాష్ట్రంలో ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు. వాహన సామర్థ్యం (ఫిట్‌నెస్/బ్రేక్) విషయంలోనూ గజిబిజే. ఎక్కడ రిజిస్ట్రేషను చేయించుకుంటే అక్కడే ఈ తనిఖీలు చేసి సర్టిఫికెట్ జారీచేస్తారు. ఇవి కూడా చాలావరకు సృష్టించుకున్నవే.



కాకినాడలో ఓ బస్సుకు ఉన్న ఎమర్జన్సీ ఎగ్జిట్ డోర్

● నిబంధనలు గాలికి..

పర్మిట్ ఇచ్చినప్పుడు ఎన్ని సీట్లు, ఎన్ని స్లీపర్లు వంటివి పొందుపరుస్తారు. కానీ చాలా బస్సుల్లో వీటి ఉల్లంఘన జరుగుతోంది. డ్రైవరు వెనుక జాగాను కూడా వదిలిపెట్టడంలేదు. ఒక్కో బస్సులో రెండు మూడు సీట్లు అనధికారికంగా ఆల్ట్రేషన్ చేయించుకొని ఏర్పాటుచేస్తున్నారు. ఒక్క సీటు అదనంగా వేసుకున్నా రోజుకు రూ.3-5వేల వరకూ గిట్టుబాటు అవుతుంది. సీట్లను స్లీపర్లుగా అనధికారికంగా మార్పులు చేస్తున్నారు. కర్నూలులో ఘోర అగ్ని ప్రమాదానికి గురైన బస్సు కూడా సీట్ పర్మిషన్ ఉండగా, స్లీపర్‌గా మార్చినట్టు చెబుతున్నారు. అయినా వీటిపై అధికారులు దృష్టి సారించలేదు. దాదాపుగా అన్ని బస్సులకు స్లీపర్ సౌలభ్యం ఉంటోంది. వీటిలో ఎన్నింటికి అనుమతులున్నాయో తెలియని పరిస్థితి ఉంది. అత్యవసర ద్వారా కనబడకుండా ఏదోవిధంగా మూసేస్తున్నారు. దీంతో అత్యవసర సమయంలో ముందర భాగంలో ఉన్న ఒకే ద్వారం గుండా దిగాల్సి రావడంతో ప్రమాద తీవ్రత పెరుగుతోంది. ఏసీ బస్సుల్లో అత్యవసర సమయంలో అద్దంబద్దలు కొట్టడానికి సుత్తి ఉండాలి. కానీ అది సుత్తిమాటగానే పట్టించుకోవడం లేదు. ఇక డ్రైవర్లకు అనుభవం ఉందా? అంటే సందేహమనే సమాధానం వినవస్తోంది. ఒక్కో బస్సుకు ఇద్దరు డ్రైవర్లు ఒక క్లీనరు ఉంటారు. సగం దూరం ఒకరు నడిపితే, మరొక సగం దూరం మరొకరు నడపాలి. కానీ అదీ అమలు కాదు. క్లీనరుకు బస్సు డ్రైవింగ్ అలవాటు చేయడం కోసం డ్రైవింగ్ సీట్లో కూర్చోబెడుతున్నారు. కొందరు డ్రైవర్లు సిటీలు దాటిన తర్వాత మద్యం సేవిస్తున్నారు. అలాగే పగలు మద్యం తాగడంతో ఆ మగతతోనే రాత్రి బస్సును తీస్తున్నారు. ఉదాహరణకు బస్సు ఉదయం హైదరాబాద్ చేరిన తర్వాత పార్కింగ్ చేస్తారు. అక్కడ వంట చేసుకొంటారు. ఈ క్రమంలో కొందరు మద్యం తాగడం తప్పనిసరిగా మారింది. ఆ మత్తు దిగకుండానే రాత్రి తిరుగు పయనమవుతున్నారు. అడుగడుగునా తనిఖీలు చేయడానికి వీలుపడదు. అదే ఆసరాగా ఇష్టానుసారం తంతు కొనసాగిస్తున్నారు. ప్రైవేటు ట్రావెల్స్ బస్సుల్లో భద్రతాపరమైన ఉల్లంఘనలు తీవ్రంగా జరుగుతున్నాయి. బస్సుల్లో సరుకులు ఏమేమి రవాణా చేస్తున్నారో కూడా పట్టించుకొనే నాథుడు ఉండడు. చాలా బస్సులు లారీల మాదిరిగా సరుకు రవాణా చేస్తున్నాయి. ఫైర్ అలారం, ఫైర్ ఎగ్జిస్టింగ్విషర్లు (అగ్నిమాపక సిలిండర్లు) ఉండనే ఉండవు. సీట్ల ఆల్ట్రేషన్ ఎక్కువగా జరుగుతోంది.

● అధికారులేమంటున్నారంటే..

కాకినాడ జిల్లాలో ప్రైవేటు ట్రావెల్స్ విషయంలో కఠినంగానే వ్యవహరిస్తున్నామని కాకినాడ రవాణాశాఖ ఉపకమిషనర్ శ్రీధర్ చెప్పారు. ప్రజలు కూడా ప్రైవేటు బస్సుల్లో ప్రయాణం సురక్షితంగా ఉందా? లేదా అనేది అవగాహనతో ఉండాలన్నారు. తూర్పుగోదావరి జిల్లా రవాణా అధికారి ఆర్.సురేష్ మాట్లాడుతూ అన్ని బస్సుల్లో భద్రతా ఏర్పాట్లు తప్పనిసరిగా ఉండాలని, సిట్టింగ్ ఆల్ట్రేషన్ చేయకూడదని, ప్రైవేటు ట్రావెల్స్ బస్సుల్లో సోదాలు చేయడానికి చర్యలు తీసుకున్నామని 'ఆంధ్రజ్యోతి'తో చెప్పారు.



ముమ్మిడివరంలో భారీ వర్షంతో నీట మునిగిన రోడ్లు

ఏక వర్షమే!

- భారీవర్షంతో స్తంభించిన జనజీవనం
- అత్యధికంగా ఉప్పలగుప్తంలో 156.4..
- అత్యల్పంగా మండపేటలో 12.2 మిల్లీమీటర్ల వర్షపాతం

అమలాపురం, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): జిల్లావ్యాప్తంగా శుక్రవారం భారీవర్షాలు ముంచెత్తాయి. దీంతో జనజీవనం స్తంభించింది. ఉదయం నుంచి సాయంత్రం 6 గంటల వరకు ఎడతెరిపిలేని వర్షం కురవడంవల్ల అనేక పల్లపు ప్రాంతాలన్నీ పూర్తిగా జలమయమయ్యాయి. పంట చేలల్లోకి నీరు చేరి పంటపొలాలుపూర్తిగా దెబ్బతిన్నాయి. జిల్లాలో అత్యధికంగా శుక్రవారం ఉప్పలగుప్తం మండలంలో 156.4 మిల్లీమీటర్ల వర్షపాతం రికార్డు అయింది. అమలాపురం పట్టణంలోని హౌసింగ్ బోర్డు కాలనీ, నారాయణపేట గండువీధి, వడ్డిగూడెం, భూపయ్య అగ్రహారంలోని పలు వీధులు జలదిగ్బంధానికి గురయ్యాయి.

జిల్లాలో వర్షపాతం వివరాలు ఇలా..

కోనసీమ జిల్లాలో శుక్రవారం కురిసిన వర్షపాతం వివరాలు ఇలా ఉన్నాయి. అత్యధికంగా ఉప్పలగుప్తం మండలంలో 156.4 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. సగటున 80.9 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. ఆత్రేయపురంలో 54.4, మండపేట 12.2, రాయవరం 32.4, రామచంద్రపురం 22.4, ఆలమూరు 76.8, రావులపాలెం 98.4, కొత్తపేటలో 112.8, కపిలేశ్వరపురం 96.4, కె.గంగవరం 84.0 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. ఐ.పోలవరంలో 112.4, ముమ్మిడివరం 90.4, అయినవిల్లి 121.4, పి.గన్నవరం 63.8, అంబాజీపేటలో 72.4, మామిడికుదురు 38.8, రాజోలు 62.8, మలికిపురంలో 94.2, సఖినేటిపల్లి 87.4, అల్లవరం 48.2, అమలాపురం 102.6, కాట్రేనికోన 134.2 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైనట్టు జిల్లా కలెక్టర్ కార్యాలయం ప్రకటించింది.



రాయవరం మండలంలోని వి.సావరం రోడ్డులో నేలవాలిన వరిచేను



అంబాజీపేటలో అరటితోటలో నిలిచిపోయిన వర్షపునీరు

ఆహార పదార్థాల కల్తీపై స్పెషల్ డ్రైవ్ చేయండి

- జేసీ నిషాంతి ఆదేశం

అమలాపురం, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): ఇటీవల జిల్లాలో ఆహార పదార్థాల కల్తీపై వస్తున్న ఫిర్యాదుల నేపథ్యంలో జిల్లావ్యాప్తంగా ఆహార పదార్థాల కల్తీ, భద్రతపై స్పెషల్‌డ్రైవ్ నిర్వహించి విస్తృతంగా తనిఖీలు చేపట్టాలని జేసీ నిషాంతి ఆదేశించారు. కలెక్టరేట్‌లో జిల్లాస్థాయి ఆహార భద్రతా కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇటీవల ఆహార కల్తీలపై పలు ఫిర్యాదులు అందాయని, వీటిని దృష్టిలో ఉంచుకుని కాకినాడ, రాజహేంద్రవరానికి చెందిన ఆహార భద్రతా అధికారులను స్థానికంగా డిప్యూటేషన్‌పై నిర్వహించి స్పెషల్ డ్రైవ్‌లు చేపట్టినట్టు తెలిపారు. ఆహార భద్రత, తూనికలు, కొలతలు, పోలీసు అధికారుల సమన్వయంతో వీటిని నిర్వహిస్తున్నామన్నారు. హోటళ్లు, దుకాణాల నిబంధనల మేరకు తనిఖీలు నిర్వహిస్తూ నిబంధనలు అతిక్రమించిన వారిని హెచ్చరిస్తూ చర్యలు తీసుకుంటామని, కల్తీ ఆహార పదార్థాలు, ఫ్రిజ్‌లో నిల్వ చేసిన హానికర పదార్థాల విక్రయంపై జరిమానాలు, శిక్షలు వంటి చర్యలు తీసుకుంటున్నారన్నారు. ప్రజారోగ్యం అనేది కీలక అంశమని ఆమె స్పష్టం చేశారు. పాలఉత్పత్తి డెయిరీలు, హోటళ్లలో తనిఖీల ద్వారా కల్తీకి ఆస్కారం లేకుండా పటిష్టమైన చర్యలు తీసుకోవాలన్నారు. హార పదార్థాల కల్తీని నిరోధించడానికి అధికారులు సమన్వయంతో కృషి చేయాలన్నారు. ఫుడ్‌సేఫ్టీ అధికారుల బృందాలు హోటళ్లు, స్వీటుషాపులు, తయారీ యూనిట్లలో బృందాలుగా ఏర్పడి తనిఖీ చేస్తూ శాంపిల్స్‌ను సేకరించాలని, వాటికి ప్రయోగశాలలో పరీక్షలు నిర్వహించాలని ఆదేశించారు. తూనికలు, కొలతలశాఖ అసిస్టెంట్ కంట్రోలర్ విశ్వేశ్వరరావు, జిల్లాఆహార భద్రతా అధికారి రామయ్య, ఫుడ్‌కంట్రోలర్ జీవీబీ నందాజీ, డీపీవో, పోలీసు అధికారులు, మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీవోలు పాల్గొన్నారు.

అరటి, కొబ్బరి ఉత్పత్తుల తయారీకి ఇంక్యుబేషన్ కేంద్రాల ఏర్పాటు

- కలెక్టర్ మహేష్‌కుమార్ వెల్లడి

అమలాపురం, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): కొబ్బరి, అరటి ఉత్పత్తుల తయారీపై శిక్షణ, ప్రోత్సాహకంకోసం అవగాహన కల్పించేందుకు ఇంక్యూబేషన్ కేంద్రాలను నెలకొల్పడానికి సన్నాహాలు చేస్తున్నట్టు కలెక్టర్ మహేష్‌కుమార్ వెల్లడించారు. కలెక్టరేట్‌లో శుక్రవారం ఉద్యాన, విశ్వవిద్యాలయ, ఫుడ్ ప్రాసెసింగ్ శాస్త్రవేత్తలు,అధికారులతో సమావేశం నిర్వహించారు. ఇందుకు అవసరమైన స్థలాలు కేటాయిస్తూ ఇంక్యూబేషన్ సెంటర్లు నెలకొల్పేందుకు డీపీఆర్‌లు రూపకల్పన చేయాలని కలెక్టర్ ఆదేశించారు. జిల్లాలో అరటి, కొబ్బరి ఉత్పత్తులను ప్రధానమంత్రి ఫార్మలైజేషన్ ఆఫ్ ఫుడ్ ప్రాసెసింగ్‌ఎంటర్‌ప్రైజెస్ ద్వారా స్వయం సంఘాల మహిళలను ప్రోత్సహిస్తామన్నారు. నాబార్డు నిధులతో వివిధగ్రాంట్ల ద్వారా మంజూరయ్యే యూనిట్లు నెలకొల్పుతూ ముడిసరుకు ఆధారంగా వివిధ రకాల ఉత్పత్తులు చేపట్టడానికి చర్యలు తీసుకుంటామన్నారు. అరటి ఫైబర్ వేస్ట్ మేనేజ్‌మెంట్ ద్వారా వర్మి కంపోస్టు తయారీ వంటి అంశాలపై అధికారులు దృష్టి పెట్టాలన్నారు. అరటి చిప్స్ తయారుచేసి పాఠశాలల్లో విద్యార్థులకు ప్రొటీన్ విలువ గల ఆహారాన్ని అందించాలన్నారు. ఉద్యాన యూనివర్సిటీ హెడ్ ముత్యాల నాయుడు, ప్రిన్సిపాల్ సెంట్రల్ అండ్ హెడ్ అంబాజీపేట తిరుపతిరెడ్డి, పోస్టు హార్వెస్టింగ్ రీచార్జి సెంటర్ డాక్టర్ సృజన, ఇంక్యూబేషన్ సెంటర్ ఇన్‌చార్జి వెంకటరమణ, డాక్టర్ రవీంద్ర, కొవ్వూరు ఎంఎస్ఎంఈ పీవో శ్రీనివాసరావు, ఏపీ ఫుడ్ ప్రాసెసింగ్ అధికారి మారుతీ, డీహెచ్‌వో రమణ, ఎల్డీఎం కేశవవర్మ పాల్గొన్నారు.

కార్తీకం నేపథ్యంలో..

స్నానఘట్టాల వద్ద పటిష్టమైన రక్షణ చర్యలు చేపట్టాలి

- సమీక్షలో జేసీ ఆదేశం

అమలాపురం, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): కార్తీకమాసం ప్రారంభం నేపథ్యంలో జిల్లాలో శివాలయాలకు వచ్చే భక్తులకోసం నదులు, సముద్ర, స్నానఘట్టాల వద్ద వసతులు కల్పించడంతోపాటు పటిష్టమైన భద్రతా చర్యలు తీసుకోవాలని జేసీ టి.నిషాంతి రెవెన్యూ, పోలీసు అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో పోలీసు, దేవదాయశాఖ అధికారులు, తహశీల్దార్లు, ఎంపీడీవోలతోపాటు జిల్లాస్థాయి భక్తుల భద్రతా సమావేశం శుక్రవారం నిర్వహించారు. కార్తీకమాసం ఉత్సవాలు నిర్వహించే ప్రాంతంలో భద్రతా ఏర్పాట్లను సమీక్షించారు. ఈ సందర్భంగా జేసీ నిషాంతి మాట్లాడుతూ కార్తీకమాసంలో భక్తులు శివారాధన చేస్తారని, నదీ, సముద్ర స్నానాలు ఎంతో ప్రాముఖ్యత సంతరించుకున్నాయని, ఇందుకోసం స్నాన ఘట్టాల వద్ద పటిష్టమైన ఏర్పాట్లు చేయాలని ఆమె సూచించారు. భక్తులు నదీ గర్భంలోకి ప్రవేశించకుండా బారికేడింగ్ వ్యవస్థను ఏర్పాటు చేయాలని, ఆలయాల్లో క్యూలైన్లను పటిష్టం చేసి భక్తుల రద్దీకి తగ్గట్టు ఏర్పాట్లు చేయాలని సూచించారు. పంచారామాల్లో ఒకటైన ద్రాక్షారామం, కుండలేశ్వరం, అంతర్వేది, మురమళ్ల వంటి ప్రధాన ఆలయాల వద్ద భక్తులకు అసౌకర్యం కలకుగుండా ఏర్పాట్లు చేపట్టాలని ఆమె ఆదేశించారు. నవంబరు 5వతేదీ కార్తీక పౌర్ణమితోపాటు ప్రతి సోమవారం నిర్వహించే శివారాధన ఈవెంట్లకు సంబంధించి అధికారులు అప్రమత్తంగా వ్యవహరించాలన్నారు. సమావేశంలో డీఆర్వో కె.మాధవి, దేవదాయ, ధర్మదాయశాఖ కమిషనర్ సత్యనారాయణ, ఈవోలు భవానీ, పోలీసు ఉన్నతాధికారులు, తదితరులు పాల్గొన్నారు.



వివిధ శాఖల అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న జేసీ నిషాంతి



గొల్లప్రోలు మండలం చేబ్రోలు పాఠశాలలో ఆధార్ ప్రత్యేక శిబిరంలో విద్యార్థుల బయోమెట్రిక్స్ అప్‌డేట్ చేస్తున్న సిబ్బంది

ఆధార్ అప్‌డేట్ చేయించుకోవడం తప్పనిసరి. ఇది విద్యార్థులకు అవసరం. పోటీ పరీక్షలకు దరఖాస్తు చేయాలన్నా, ప్రభుత్వ పథకాలు పొందాలన్నా ఇది కీలకం. ఐదు సంవత్సరాలు దాటిన వారంతా తమ బయోమెట్రిక్స్ నవీకరణ చేయించుకునేందుకు ప్రభుత్వం అవకాశం కల్పించింది. ఇందుకోసం ఎంపిక చేసిన పాఠశాలల్లో ఈ నెల 30వ తేదీ వరకు ప్రత్యేక ఆధార్ శిబిరాలు ఏర్పాటు చేశారు. ఇక్కడ సేవలు ఉచితంగా లభిస్తాయి.

ఆధార్ అప్‌డేట్ తప్పనిసరి

- బయోమెట్రిక్స్ నవీకరించకుంటే భవిష్యత్తులో ఇబ్బందులు
- ఉమ్మడి జిల్లాలో చేయించుకోవాల్సిన విద్యార్థులు 1.88 లక్షలు
- ఎంపిక చేసిన పాఠశాలల్లో ఈ నెల 30 వరకు ప్రత్యేక శిబిరాలు
- ప్రస్తుతం సేవలు ఉచితమే

(పిఠాపురం-ఆంధ్రజ్యోతి)

బాల ఆధార్ తీయించుకున్న చిన్నారులు, విద్యార్థులు ఐదు సంవత్సరాలు దాటిన తర్వాత ఒకసారి, 15 సంవత్సరాలు దాటిన తర్వాత మరొకసారి తప్పనిసరిగా తమ బయోమెట్రిక్స్ అప్‌డేట్ చేయించుకోవాలి. ఇప్పుడు పాఠశాలల్లో అపార్ ఐడీ క్రియేట్ చేసేందుకు, ప్రభుత్వ సంక్షేమ పథకాలు పొందేందుకు, పోటీ పరీక్షలకు హాజరయ్యేందుకు ఆధార్ అవసరం. ఇది అప్‌డేట్ అయితేనే గానీ వీటికి అర్హత సాధించలేరు. దీనిపై ఇప్పటికే పలుమార్లు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవకాశం కల్పించినా ఇంకా వేల సంఖ్యలో విద్యార్థులు తమ ఆధార్‌ను అప్‌డేట్ చేయించుకోలేదు. ఇటువంటి వారి వివరాలను విద్యా శాఖ సేకరించింది. వీరందరి ఆధార్ బయోమెట్రిక్స్ (ఎంబీయూ)ను నవీకరించేందుకు యూఐడీఏఐ, గ్రామ, వార్డు సచివాలయ శాఖలతో సంప్రందించి ప్రత్యేక ఆధార్ శిబిరాలు ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. రాష్ట్రవ్యాప్తంగా ఎంపిక చేసిన పాఠశాలల్లో వీటిని ఏర్పాటుచేశారు. ఈ ప్రక్రియ ఇప్పటికే ప్రారంభమైంది.



ఎందుకోసమంటే...

చిన్నారులు (విద్యార్థులు) ఎదుగుతున్న క్రమంలో వారి వేలిముద్రలు, ఫొటో, కనురెప్పల దృశ్యాలు (ఐరిస్ లేదా కంటి కిరణాలు) మారుతూ ఉంటాయి. ఈ క్రమంలో వీటిని ఆధార్ డేటాలో అప్‌డేట్ చేయకుంటే భవిష్యత్తులో ఇబ్బందిపడతారు. పోటీ పరీక్షలు, ప్రభుత్వ పథకాలు... ఇతరత్రా విషయాల్లో ఆధార్ అథంటికేషన్ చేయించడంలో సాంకేతిక సమస్యలు తలెత్తుతాయి. దీనికోసం 5సంవత్సరాలు, 15 సంవత్సరాలు దాటిన విద్యార్థులకు మాండేటరీ బయోమెట్రిక్ అప్‌డేట్ (ఎంబీయూ) తప్పనిసరి చేశారు. అప్‌డేట్ ప్రక్రియను 60-70 శాతం విద్యార్థులు ఇప్పటికే పూర్తి చేసుకున్నారు. మిగిలిన వారు ఇంకా చేయించుకోకపోవడంతో వారికి పాఠశాలల్లోనే ఉచితంగా చేయించుకునే అవకాశం కల్పించారు.

ఉమ్మడి జిల్లాలో ఇలా...

ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో 5-15 సంవత్సరాలు మధ్యన, 15 సంవత్సరాలు దాటిన 1,87,949 మంది విద్యార్థులు తమ ఆధార్ బయెమెట్రిక్స్‌ను ఇంకా అప్‌డేట్ చేయించుకోలేదని విద్యా శాఖ గుర్తించింది. ఇదే సమాచారాన్ని యూఐడీఏఐకు అందజేసింది. కాకినాడ జిల్లాలో 5-15 సంవత్సరాల మధ్య విద్యార్థులు 41,640 మంది, 15 సంవత్సరాలు దాటిన విద్యార్థులు 33,395 మంది ఇంకా ఆధార్ అప్‌డేట్ చేయించుకోవాల్సి ఉంది. తూర్పు గోదావరి జిల్లాలో 5-15 కేటగిరీలో 33,417 మంది విద్యార్థులు, 15 దాటిన వారు 36,471 మంది ఉండగా, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో 5-15 కేటగిరీలో 23,556 మంది, 15 సంవత్సరాలు దాటిన విద్యార్థులు 19,470 మంది ఆధార్ బయోమెట్రిక్స్‌ను నవీకరించుకోవాల్సి ఉంది.

ఈ నెల 30 వరకు అవకాశం

విద్యార్థులు తమ ఆధార్ బయోమెట్రిక్స్‌ను అప్‌డేట్ చేయించుకునేందుకు వీలుగా కాకినాడ, తూర్పు గోదావరి, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాల పరిధిలో ఎంపిక చేసిన పాఠశాలల్లో ఆధార్ ప్రత్యేక శిబిరాలు నిర్వహిస్తున్నారు. ఇందుకోసం గ్రామ, వార్డు సచివాలయాల నుంచి డిజిటల్ అసిస్టెంట్లు, సెక్రటరీలను నియమించారు. ఈ నెల 30వ తేదీ వరకు ఇవి కొనసాగుతాయి. పాఠశాలల వారీగా ఆధార్ బయోమెట్రిక్స్ అప్‌డేట్ చేయించుకోవాల్సిన విద్యార్థుల జాబితాను యూడీఐఎస్ఈ ప్లస్ పోర్టల్ ద్వారా పెండింగ్ ఎంబీయూ రిపోర్టును డౌన్‌లోడ్ చేసి వారందరికీ సమాచారం ఇవ్వాలని విద్యాశాఖాధికారులు, ఉపాధ్యాయులకు ప్రభుత్వం సూచించింది. నూరు శాతం విద్యార్థులు తమ వివరాలు అప్‌డేట్ చేసేలా చూడాలని ఆదేశించింది. విద్యార్థులు ఇందుకు అవసరమైన పత్రాలు తీసుకుని వచ్చేలా అవగాహన కల్పించాలని హెచ్ఎంలకు సూచనలు ఇచ్చారు. ఇదే విషయంపై విద్యార్థులకు సమాచారం ఇవ్వాలన్నారు. ఇప్పుడు ఆధార్ బయోమెట్రిక్ సేవలను ఉచితంగానే అందిస్తున్నారు.





సూర్యోదయంలోపు స్నానాలు.... పూజలు... ఉపవాసాలు.. కార్తీక మాసంలో ఆధ్యాత్మికతే కనిపిస్తుంది. మాలధారణలు, సంప్రదాయాలు ఉట్టిపడతాయి. హైటెక్ కాలంలోనూ భక్తులు పూర్వకాలం నుంచీ వస్తున్న ఆచార వ్యవహారాలను పాటిస్తున్నారనడానికి ఈ మాసమే నిదర్శనం. అయితే కాలాన్ని బట్టి మనుషుల్లో వచ్చే కొన్ని రుగ్మతలను అరికట్టేందుకే ఈ ఆచారాలను మన పూర్వీకులు ప్రవేశపెట్టారంటారు వైద్యులు.

ఏకాదశ రుద్రుల దర్శనం... పుణ్యప్రదం

(అంబాజీపేట-ఆంధ్రజ్యోతి)

కోనసీమలో 450 శతాబ్దాల చరిత్ర కలిగిన ఏకాదశ రుద్రులు కొలువుదీరారు. వ్యాఘ్రేశ్వరం వ్యాఘ్రేశ్వరస్వామి (విశ్వేశ్వర రుద్రుడు), గంగలకుర్రు అగ్రహారం వీరేశ్వరస్వామి (సర్వేశ్వర రుద్రుడు), నేదునూరు చెన్నమల్లేశ్వరస్వామి (తికాగ్నికాల రుద్రుడు), కె.పెదపూడి మేనకేశ్వరుడు (మహాదేవ రుద్రుడు), పుల్లేటికుర్రు అభినవ వ్యాఘ్రేశ్వరస్వామి (శ్రీమన్మహాదేవ రుద్రుడు), ముక్కామల రాఘవేశ్వరస్వామి (కాలాగ్ని రుద్రుడు), వక్కలంక విశ్వేశ్వరస్వామి (త్రిపురాంతక రుద్రుడు), మొసలపల్లి మధుమానంత భోగేశ్వరస్వామి (నీలకంఠ రుద్రుడు), పాలగుమ్మి చెన్నమల్లేశ్వరుడు (మృత్యుంజయ రుద్రుడు), గంగలకుర్రు చెన్నమల్లేశ్వర స్వామి (సదాశివ రుద్రుడు), ఇరుసుమండ ఆనందరామేశ్వరస్వామి (త్ర్యంబకేశ్వర రుద్రుడు). కార్తీక మాసంతో పాటు ఇతర రోజుల్లో ఏకాదశ రుద్రులను ఒకేరోజు దర్శించుకోవడం ఎంతో పుణ్యప్రదమని పండితులు చెప్తున్నారు.



ఏకాదశ రుద్రుల దర్శనానికి పలు ఆర్టీసీ డిపోల నుంచి అధికారులు ప్రత్యేక బస్సు సర్వీసులు నడపనున్నారు. ఈ ఏడాది అధిక సంఖ్యలో భక్తులు వచ్చే అవకాశం ఉందని వారు చెప్తున్నారు. సోషల్ మీడియా ద్వారా ప్రచారం నిర్వహించారు. దూర ప్రాంతాల నుంచి వచ్చే భక్తులకు అల్పాహారం, విందు ఏర్పాటు చేసేందుకు ఆయా ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లు చేస్తున్నారు.



దీపారాధన...

శివనామస్మరణ చేస్తూ ఒత్తులను తయారుచేసి రోజుకు ఒకటి చొప్పున మొత్తం 365 ఒత్తులతో శివునికి దీపారాధన జరిపితే పుణ్యం లభిస్తుందని శాస్త్రం చెప్తోంది. ఏకాదశి నాడు ఉపవాసం, ద్వాదశి నాడు తులసి వివాహం, వైకుంఠ చతుర్దశి నాడు ఉసిరి చెట్టు కింద దీపారాధన చేస్తారు. కార్తీక పౌర్ణమి నాడు 365 ఒత్తులతో దీపారాధన చేస్తారు. విష్ణుమూర్తికి ఇష్టమైన పౌర్ణమి రోజున స్నానాలు ఆచరించి సత్యనారాయణస్వామి వ్రతం ఆచరిస్తారు.

వన భోజనం... ఆరోగ్య రహస్యాలు

కార్తీక మాసంలో వన భోజనాలు అధికంగా చేస్తారు. కార్తీక పౌర్ణమి రోజున ఉసిరి చెట్టు కింద సమారాధన చేసి బంధు మిత్రులతో కలిసి భోజనం చేస్తే ఎంతో మంచి జరుగుతుంది. ఉసరిక వనంలో భోజనం చేస్తే పాప విముక్తులై విష్ణులోకానికి వెళ్తారనేది భక్తుల నమ్మకం.



వ్యాధులను కలగజేసే క్రిములను నాశనం చేసేలా ఆవుపేడ యాంటీబయాటిక్‌గా ఉపయోగపడుతుంది. అవకాశం ఉన్నవారు ఈ నెలలో ఇంటి ముందు ఆవుపేడతో కల్లాపి చల్లి ముగ్గులు వేస్తే వ్యాధులు దరిచేరవు. ముగ్గు, పేడలోని రసాయనాల వల్ల వైరస్‌లు వ్యాపించవు.

తులసి మొక్క చుట్టూ ప్రదక్షిణ చేసేటప్పుడు పీల్చే గాలి రోగనిరోధక శక్తిని పెంచుతుంది. స్వచ్ఛమైన గాలిని పీల్చడం వల్ల జలుబు, గొంతు వ్యాధులు రావు. సూర్యోదయంలోపు స్నానం చేస్తే రక్తప్రసరణ సాఫీగా ఉంటుంది.

మహిళలు తెల్లవారుజామునే నిద్రలేవడం, పసుపు రాసుకోవడం, చల్లని నీటితో స్నానం చేయడం, తులసి మొక్కకు నీళ్లు పోసిచుట్టూ ప్రదక్షిణ చేస్తే ఆరోగ్యదాయకం.

అల్పాహారం, మధ్యాహ్నం మిత భోజనం, రాత్రిపూట పండ్లు, పాలు వంటివి తీసుకోవడం ఇందులో భాగమే. కార్తీకమాసమంతా నియమాలు పాటిస్తే ఆరోగ్యంగా ఉంటారు.

బాధిత కుటుంబాలకు ప్రభుత్వం అండ

- కార్మిక శాఖ మంత్రి సుభాష్
- ఎమ్మెల్యేలు నల్లమిల్లి, వేగుళ్లతో కలిసి రాయవరం మృతుల కుటుంబాలకు చెక్కుల పంపిణీ
- ఒక్కొక్కరికి రూ.15 లక్షల పరిహారం
- యజమాని తరపున రూ.2.50 లక్షల చొప్పున అందజేత



కొమరిపాలెంలో మృతుల కుటుంబాలకు చెక్కులు అందజేస్తున్న మంత్రి సుభాష్, ఎమ్మెల్యేలు నల్లమిల్లి, వేగుళ్ల

అనపర్తి, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో విపత్తులు జరిగి ప్రాణనష్టం వాటిల్లినపుడు పరిహారం అందించడంతో ప్రభుత్వం ముందు వరుసలో నిలుస్తుందని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ అన్నారు. ఈనెల 8న బిక్కవోలు మండలం కొమరిపాలెం, రాయవరం మండలం వి.సావరం గ్రామాల సరిహద్దుల్లో గణపతి గ్రాండ్ ఫైర్ వర్క్స్‌లో జరిగిన అగ్ని ప్రమాదంలో మృతి చెందిన కుటుంబాలకు శుక్రవారం కొమరిపాలెంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మంత్రి సుభాష్, ఎమ్మెల్యేలు నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, వేగుళ్ల జోగేశ్వరరావు చేతుల మీదుగా పరిహారం అందజేశారు. ముందుగా మృతుల కుటుంబాలకు నివాళులర్పించి సభను ప్రారంభించారు. ఈ ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయిన అనపర్తికి చెందిన చిట్టూరి శ్యామల, పెంకే శేషారత్నం,కురుపూడి జ్యోతి, చిట్టూరి యామిని, కొమరిపాలేనికి చెందిన వెలుగుబంట్ల సత్యనారాయణ, రమణ, వాసంశెట్టి విజయలక్ష్మి, కె.సదానంద్, లింగం వెంకటకృష్ణ,పాకా అరుణ కుటుంబాలకు కార్మిక శాఖ తరపున ఒక్కొక్క కుటుంబానికి రూ.15 లక్షలు, యజమాని వెలుగుబంట్ల సత్యనారాయణ తరపున ఆయన కుమారుడు ఒక్కొక్క కుటుంబానికి రూ.2.50 లక్షల పరిహారాన్ని అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ సంఘటన దురదృష్టకరమన్నారు. ప్రతిపక్ష నాయకులు ఈ ఘటనను రాజకీయం చేయాలని చూసి, పలు ఆరోపణలు చేశారని అందుకే ప్రభుత్వం ద్విసభ్య కమిటీని నియమించి నిజానిజాలను తేల్చిందని అన్నారు. దీంతో వైసీపీ మాటలు అసత్యాలని తేలిందన్నారు. బాధితుల్లో 8 మందికి టీడీపీ సభ్యత్వాలు ఉన్నాయని వారికి త్వరలో పార్టీ తరపున ఒక్కొక్క కుటుంబానికి రూ.5 లక్షల బీమా అందే విధంగా చర్యలు చేపడుతున్నామన్నారు. ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ ప్రమాదం జరిగిన వెంటనే ఎమ్మెల్యే జోగేశ్వరరావుతో కలిసి సహాయక చర్యల్లో పాల్గొన్నామన్నారు. పరిహారంపై అసత్య ప్రచారాలు చేసిన మాజీ ఎమ్మెల్యే 2019 ఎన్నికల్లో విజయోత్సవంలో జరిగిన బాణసంచా ప్రమాదంలో నలుగురు చనిపోతే వారికి పరిహారం మాట అటుంచి పరామర్శకే నెలల సమయం పట్టిందన్నారు. కార్యక్రమంలో కోనసీమ జిల్లా కలెక్టర్ మహేష్‌కుమార్, అనపర్తి జనసేన ఇన్‌చార్జి మర్రెడ్డి శ్రీనివాసరావు, ఏఎంసీ చైర్‌పర్సన్ జుత్తుక సూర్యకుమారి, రావాడ నాగు, కర్రి శేషారత్నం, బేరా వేణమ్మ, కర్రి సత్యగౌరి, గొల్లు హేమతులసి, గిరిడా గంగాభవాని పాల్గొన్నారు.

కాకినాడలో తొలి కృత్రిమ మేథస్సు (ఏఐ) సదస్సు



ఏఐ ఫ్యూజన్ సదస్సు-2025 సదస్సుకు విచ్చేసిన ముఖ్య అతిథులు

కాకినాడ సిటీ/కార్పొరేషన్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): గోదావరి ప్రాంతంలో తొలి కృత్రిమ మేధస్సు సదస్సు-ఏఐ ఫ్యూజన్ సదస్సు-2025ను శుక్రవారం జిల్లా కేంద్రం కాకినాడలోని ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించారు. సదస్సును జేఎన్టీయూకే వైస్ చాన్సలర్ సీఎస్ఆర్కే ప్రసాద్ ప్రారంభించారు. ఈ సందర్భంగా 'ఏయాజ్ నెక్ట్స్ ఇండస్ట్రియల్ రివల్యూషన్, షాపింగ్ ద ఫ్యూచర్ బిజినెస్, సొసైటీ -ఇన్నోవేషన్' అంశంపై గోవిన్ కాపిటల్ సీఈవో ఆనంద్ గోవిందలూరి ప్రసంగించారు. ఇతర ముఖ్య అతిథులుగా ఎస్టీపీఐ అదనపు డైరెక్టర్ ఏవీ మల్లేశ్వరరావు, ఐటాప్ అధ్యక్షుడు ఇంద్రజిత్ యానే, ఏపీడీటీ నెట్‌వర్క్ చైర్మన్ శ్రీధర్ కోసరాజు విచ్చేశారు. సదస్సులో 1000 మందికి పైగా ఐటీ నిపుణులు, కోర్సెస్, విద్యార్థులు, స్టార్టప్ ప్రతినిధులు, అకడమిక్ సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు. ఈ సదస్సు ను డీప్ టెక్ నైపుణ్య ఫౌండేషన్, ఏపీ డిజిటల్ టెక్నాలజీ ఇండస్ట్రీ నెట్‌వర్క్ సంస్థలు సంయుక్తంగా నిర్వహించాయి. ఈ ఏఐ ఫ్యూజన్ సదస్సుకు భారత ప్రభుత్వ సంస్థయైన ఇండియా ఏఐ మిషన్ నుంచి అధికారిక గుర్తింపు లభించింది. ఈ సదస్సును 2026 ఫిబ్రవరి 19,20 తేదీల్లో న్యూఢిల్లీలో జరిగే ఇండియా ఏఐ ఇంపాక్ట్ సమ్మిట్- 2026కు ప్రీ- సమ్మిట్ ఈవెంట్‌గా గుర్తించారు.ఈ సమ్మిట్‌లో ఏఐ ఫర్ పీపుల్, ప్లానెట్, ప్రోగ్రస్ అనే అంశంపై ప్రపంచ ఏఐ నిపుణులు ప్రసంగించను న్నారని సదస్సు నిర్వాహకులు తెలిపారు.కార్యక్రమంలో భాగంగా యువ ప్రతిభావంతులను గుర్తిస్తూ బెస్ట్ ఏఐ స్టార్టప్, బెస్ట్ ఏఐ ఐడియా, బెస్ట్ స్టూడెంట్ ఏఐ ప్రాజెక్టు విన్నర్, రన్నర్ అవార్డులు అందజేశారు. సదస్సులో గూగుల్, క్యాప్‌జెమినీ, బోష్, టీసీఎస్, ఇన్ఫోసిస్ తదితర గ్లోబల్ కంపెనీలకు చెందిన ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ నిపుణులు పాల్గొన్నారు.





సదస్సులో పాల్గొన్న ఏఐ నిపుణులు, విద్యార్థులు

కార్తీక దీపారాధన ఏర్పాట్లకు రాట ముహూర్తం



పోస్టర్ ఆవిష్కరిస్తున్న బోనం శ్రీను తదితరులు

ద్రాక్షారామ, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): ద్రాక్షారామలో ప్రసన్నాంజనేయ బాలభక్త సమాజం ఆధ్వర్యంలో నవంబరు 18న నిర్వహించనున్న కార్తీక దీపారాధన ఏర్పాట్లకు శుక్రవారం రాట ముహూర్తం చేశారు. ఉదయం 11.23 గంటలకు వెంకటేశ్వర రైస్ ఇండస్ట్రీస్ అధినేత సత్తి సుబ్బారెడ్డితో రాట వేయించారు. ముందుగా ప్రసన్నాంజనేయస్వామి ఆలయంలో పూజలు చేశారు. అనంతరం కార్తీక దీపారాధన కార్యక్రమాల పోస్టర్‌ను సుబ్బారెడ్డి,ప్రసన్నాంజనేయ బాలభక్త సమాజం అధ్యక్షుడు బోనం శ్రీనివాస్, సభ్యులు ఆవిష్కరించారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు కొత్తపల్లి అరుణ, అనిశెట్టి రామకృష్ణ, యల్లమిల్లి సతీష్‌కుమారి, ఎంపీపీ అంబటి భవానీ, వైస్ ఎంపీపీ శాకా బాబి, వైసీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి పిల్లి సూర్యప్రకాష్, తోట పృథ్విరాజ్, జనసేన నాయకులు నామా వెంకన్నబాబు, చోడిశెట్టి శివాజీ, మాజీ సర్పంచ్‌లు యాట్ల అప్పారావు, కొండేపూడి జానకిరామయ్య పాల్గొన్నారు.

దత్త దీక్షల స్వీకారం

పిఠాపురం, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా పిఠాపురం పాదగయ క్షేత్రంలో స్వయంభూ దత్తాత్రేయ స్వామి సన్నిధిలో దత్త దీక్షల స్వీకారం శుక్రవారం వైభవంగా జరిగింది. భక్తులకు అర్చకస్వాములు మాలధారణ చేశారు. దత్త మహా మండల దీక్ష 41 రోజులు కొనసాగుతుంది. దత్తస్వాములు పాదగయ పుష్కరిణిలో స్నానాలు ఆచరించి దత్తాత్రేయుని ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేశారు. అనంతరం కుక్కుటేశ్వరస్వామి, దత్తాత్రేయస్వామి, రాజరాజేశ్వరీదేవి, పురుహూతికా అమ్మవార్లను దర్శించుకుని పూజలు జరిపారు. దత్తాత్రేయస్వామికి విశేష పూజలు జరిగాయి. ఈవో కాట్నం జగన్మోహన శ్రీనివాస్ ఏర్పాట్లను పర్యవేక్షించారు.



డైట్‌లో అధ్యాపక ఉద్యోగాలకు
దరఖాస్తుల ఆహ్వానం

కాకినాడ రూరల్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా పరిధిలోని జిల్లా విద్యా శిక్షణా సంస్థ (డైట్)లో డిప్యూటేషన్ పద్దతిలో 2025-26 విద్యా సంవత్సరానికి అధ్యాపక ఉద్యోగాలకు అర్హులైన పాఠశాల సహాయకులు(ఎస్ఏ)నుంచి దరఖాస్తులను కోరుతున్నట్టు డీఈవో పి.రమేష్ ఒక ప్రకటనలో తెలిపారు. దరఖాస్తుదారుల వయస్సు 58 ఏళ్ల లోపు ఉండి పీజీలో 55శాతం, ఎంఈడీలో 55శాతం కలిగి స్కూల్ అసిస్టెంట్‌గా కనీసం 5ఏళ్ల అనుభవం ఉండాలన్నారు. దరఖాస్తులను హెచ్ఎం, ఎంఈవో ద్వారా కాకినాడ డీఈవో కార్యాలయంలో ఈనెల 29 సాయంత్రం 5గంటల లోపు సమర్పించాలని సూచించారు. తెలుగు-1, ఆంగ్లం-1, గణితం-1, ఫైన్ ఆర్ట్స్-2 ఖాళీలున్నాయని తెలిపారు. ఫైన్ ఆర్ట్స్‌కు మాత్రం సంబంధిత పీజీలో ప్రథమ లేదా ద్వితీయ శ్రేణిలో ఉత్తీర్ణులై ఉండాలని చెప్పారు. రాత పరీక్ష, ఇంటర్వ్యూ ద్వారా ఈ ఖాళీలను భర్తీ చేస్తామన్నారు. ఆసక్తి గల ఉపాధ్యాయులు https://forms.gle/oJZMnbkEtNynPLxi9 లింక్ ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసి హార్డు కాపీని సంబంధిత అధికారుల ద్వారా డీఈవో కార్యాలయంలో సమర్పించాలని డీఈవో పేర్కొన్నారు.

వాడపల్లి వెంకన్న అన్నదాన భవన
నిర్మాణానికి రూ.1.50 కోట్ల విరాళం



భవన నిర్మాణాన్ని దాతలతో కలిసి పరిశీలిస్తున్న ఎమ్మెల్యే బండారు

ఆత్రేయపురం, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా వాడపల్లిలో శ్రీ వేంకటేశ్వస్వామి ఆలయంలో నిర్మిస్తున్న వకుళమాత అన్నదాన భవన నిర్మాణంలో భాగంగా కిచెన్, బాయిలర్ల ఏర్పాటుకు దాతలు రూ.1.50 కోట్ల విరాళం అందజేశారు. శుక్రవారం సాయంత్రం కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావుకు దాతలు, పశ్చిమగోదావరి జిల్లా రైస్‌మిల్లర్స్ అసోషియేషన్‌కు చెందిన శ్రీరామరాజు రూ.1.50 కోట్లతో అన్నదాన భవనంలో కిచెన్ నిర్మాణం, స్టీమింగ్ బాయిలర్ల ఏర్పాటుకు విరాళంగా అందజేశారు.అలాగే ఆనంద్ గ్రూప్ చైర్మన్ కాశీవిశ్వనాథరాజు వాటర్ ప్లాంట్, బయోగ్యాస్ ఏర్పాటుకు విరాళం అందించారు. తొలుత దాతలు స్వామివారిని దర్శించుకుని వేదాశీర్వచనం అందుకున్నారు. ఆలయ చైర్మన్ ముదునూరి వెంకట్రాజు, ఉపకమిషనరు నల్లం సూర్యచక్రధరరావు దాతలకు శేషవస్త్రం కప్పి స్వామివారి చిత్రపటం, ప్రసాదాలు అందజేశారు. అనంతరం ఎమ్మెల్యేతో కలిసి అన్నదాన భవనంలోని కిచెన్, స్టీమింగ్ బాయిలర్ల ఏర్పాటును పరిశీలించారు. ఆలయంలో చేపడుతున్న అభివృద్ధి పనులను పరిశీలించి ఇంజనీరింగ్ అధికారులకు పలు సూచనలు చేశారు.

స్విమ్మింగ్‌లో రవితేజకు రజత, కాంస్య పతకాలు



యానాం, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): ఆస్ట్రేలియన్ మాస్టర్స్ గేమ్స్‌లో స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా యానాం శాఖకు చెందిన స్విమ్మింగ్ కోచ్ గ్రంధి రవితేజ అత్యుత్తమ ప్రతిభ కనబరిచి రజత, కాంస్య పతాకాలను కైవసం చేసుకున్నట్టు యానాం సాయ్ ఇన్‌చార్జి ఉదయ్‌కుమార్ తెలిపారు. ఈ నెల 18 నుంచి 25 వరకు కాన్‌బెర్రాలో జరిగిన పోటీల్లో రవితేజ 50 మీటర్ల బ్రెస్ట్ స్ట్రోక్‌లో రజతం, 25 మీటర్ల ఫ్రీస్టైల్‌లో కాంస్య పతకాన్ని సాధించారన్నారు. ఈ సందర్భంగా ఆస్ట్రేలియాలో ఉన్న కోచ్ రవితేజకు ఉదయ్‌కుమార్‌తోపాటు పలువురు అభినందనలు తెలిపారు.

రెజ్లింగ్‌లో వర్షిణికి కాంస్యం



ముమ్మిడివరం, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి రెజ్లింగ్ పోటీల్లో కాకినాడ బాలికల గురుకుల పాఠశాలలో ఇంటర్మీడియట్ చదువుతున్న ముమ్మిడివరం మండలం లంకాఫ్ ఠాణేలంక గ్రామానికి చెందిన వడ్డి మేఘవర్షిణి కాంస్య పతకం సాధించింది. విజయవాడలో జరిగిన అండర్-19 రాష్ట్ర ఇంటర్ డిస్ట్రిక్ట్ రెజ్లింగ్ చాంపియన్‌షిప్ 59 కిలోల విభాగంలో మేఘవర్షిణి ద్వితీయ స్థానంలో నిలిచింది. ఈ సందర్భంగా విద్యార్థినిని పలువురు అభినందించారు.

రాష్ట్రస్థాయి బాస్కెట్‌బాల్ పోటీలకు సిరిమల్లి ఎంపిక



అంబాజీపేట, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఉమ్మడి తూర్పుగోదావరి స్థాయిలో నిర్వహించిన అండర్-14 విభాగం బాస్కెట్‌బాల్ పోటీల్లో అంబాజీపేట హైస్కూల్ 7వ తరగతి విద్యార్థి జి.సిరిమల్లి ఎంపికైనట్టు పీడీ కుంపట్ల ఆదిలక్ష్మి తెలిపారు. వచ్చే నెల 1, 2, 3 తేదీల్లో అన్నమయ్య జిల్లా మదనపల్లిలో జరిగే రాష్ట్ర పోటీల్లో ఆమె పాల్గొంటుందని చెప్పారు. ఈ సందర్భంగా విద్యార్థినిని పలువురు అభినందించారు.

వనదుర్గ ఆలయంలో ఘనంగా చండీహోమం


హోమ పూర్ణాహుతి గావిస్తున్న పండితులు

అన్నవరం, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): రత్నగిరి క్షేత్రరక్షకి వనదుర్గ ఆలయంలో శుక్రవారం చండీహోమం ఘనంగా జరిగింది. ఉదయం 9గంటలకు పండితులు గణపతిపూజ, పుణ్యాహవచనం అనంతరం అమ్మవారికి చండీ,సప్తసతి పారాయణలు, మూలమంత్రజపములు పఠించారు. 11గంటలకు పవిత్ర హోమగుండంలో సుగంధద్రవ్యాలను అర్పించి పూర్ణాహుతి గావించారు. చతుర్వేదపండితుల వేదాశీర్వచనాలు అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

నిత్యాన్నదాన పథకానికి రూ.లక్ష విరాళం

అన్నవరం, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): అన్నవరం దేవస్థానంలో ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న సత్యదేవా నిత్యాన్నదాన పథకానికి శుక్రవారం ఒకదాత రూ.1,00116 విరాళంగా సమర్పించారు. మిర్యాలగూడకు చెందిన కొంకిమాళ్ల ప్రకాష్ ఈ మొత్తాన్ని ఆలయ ఈవో సుబ్బారావుకు అందజేయగా దాతను ఆయన అభినందించి వారికి స్వామివారి ప్రసాదం, ప్రత్యేక దర్శన సౌకర్యం కల్పించారు.


ఈవోకు విరాళం అందజేస్తున్న దాత

రూ.2.50 కోట్లతో విశ్రాంత షెడ్డు
సత్యదేవుడి భక్తులకు అంకితం

నిర్మించిన లారస్ ల్యాబ్ సంస్థ


విశ్రాంత షెడ్డును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే సత్యప్రభ

అన్నవరం, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ పుణ్యక్షేత్రమైన సత్యదేవుడి సన్నిధిలో ప్రముఖ ఫార్మా షూటికల్ సంస్థ లారస్ ల్యాబ్ రూ.2.50 కోట్లతో నిర్మించిన విశ్రాంత షెడ్డును శుక్రవారం స్థానిక ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ ప్రారంభించగా దీనిని భక్తులకు అంకితమిస్తున్నట్టు సంస్థ సీఈవో చావా సత్యనారాయణ పేర్కొన్నారు. భక్తులు అధికంగా ఉండే పశ్చిమ రాజగోపురం ఎదురుగా దీనిని నిర్మించారు. రత్నగిరికి విచ్చేసే సాధారణ భక్తులు ఎండకు ఎండి, వర్షానికి తడుస్తూ అనేక ఇబ్బందులు ఎదుర్కొనేవారు. 2023లో దీనిని నిర్మించేందుకు సంస్థ ముందుకొచ్చినా సాంకేతిక కారణాలతో నిలిచిపోయింది. ఇటీవల అన్నవరం దేవస్థానం చైర్మన్ రోహిత్, ఈవో వీర్ల సుబ్బారావు మరోసారి సంస్థ ప్రతినిధులతో చర్చించి కార్తీకమాసం ప్రారంభానికి అందుబాటులోకి వచ్చేలా ప్రయత్నించారు. ఎమ్మెల్యే సత్యప్రభ మాట్లాడుతూ లారస్ సంస్థ దాతృత్వాన్ని కొనియాడారు. రాష్ట్రం నలుమూలల నుంచి విచ్చేసే భక్తులకు ఇది ఎంతో ఉపయోగకరంగా ఉంటుందన్నారు. ఆలయాన్ని అన్నివిధాలా అభివృద్ధి పరిచేందుకు కృషిచేస్తానని తెలిపారు. కార్యక్రమంలో ఈవో వీర్ల సుబ్బారావు, చైర్మన్ రోహిత్, సర్పంచ్ శెట్టిబత్తుల కుమార్‌రాజా పాల్గొన్నారు.


అన్నవరంలో భక్తుల కోసం లారస్ ల్యాబ్ నిర్మించిన విశ్రాంత షెడ్డు

ఇంకెన్నిరోజులో!

- వైసీపీ ఎమ్మెల్సీ అనంతబాబు డ్రైవర్ హత్య కేసు ఛార్జిషీటు గడువు పెంపు
- మరో ఐదునెలల గడువు మంజూరు చేసిన అట్రాసిటీ న్యాయస్థానం
- ఇప్పటికే న్యాయస్థానం 90 రోజులు గడువు ఇచ్చినా పూర్తికాని తదుపరి విచారణ
- ఎస్‌ఎఫ్‌ఎల్ నివేదికలు అందకపోవడం, సాక్ష్యుల విచారణ పూర్తవలేదని ప్రాసిక్యూషన్ విజ్ఞప్తి
- గత వైసీపీ హయాంలో కేసును నీరుగార్చేయడంతో తాజా విచారణలో పోలీసులకు ఎన్ని చిక్కులో

(కాకినాడ, ఆంధ్రజ్యోతి)

వైసీపీ ఎమ్మెల్సీ అనంతబాబు డ్రైవర్ వీధి సుబ్రహ్మణ్యం హత్య కేసుకు సంబంధించి తదుపరి విచారణలో అనేక ఆటంకాలు ఎదురవుతున్నాయి. కేసులో తదుపరి విచారణ కొనసాగించి 90రోజుల్లో ఛార్జిషీటు దాఖలు చేయాలని న్యాయస్థానం ఆదేశించినా ఇప్పటికీ ఆ దిశగా పెద్దగా పురోగతి కనిపించడం లేదు. గత ప్రభుత్వ పెద్దల ఆదేశాలతో అప్పట్లో పోలీసులు కేసును నీరుగార్చేయడంతో ఇప్పుడు పూర్తిస్థాయి ఆధారాల సేకరణ పోలీసులకు కష్టమవుతోంది. ఈ నేపథ్యంలో తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరంలోని అట్రాసిటీ న్యాయస్థానం ఇదివరకే ఇచ్చిన 90రోజుల గడువు బుధవారంతో ముగిసిపోయింది. ఈ నేపథ్యంలో న్యాయస్థానం ఇచ్చిన గడువులోగా ఛార్జిషీటు దాఖలు చేయలేని పరిస్థితి నెలకొనడంతో మరో ఐదునెలల పాటు అదనపు గడువు కావాలని తాజాగా ప్రాసిక్యూషన్ న్యాయస్థానాన్ని అభ్యర్థించింది. హత్యకు సంబంధించి డ్రైవర్ సుబ్రహ్మణ్యం మృతదేహం నుంచి సేకరించి నమూనాలను స్టేట్ ఫోరెన్సిక్ ల్యాబ్‌కు పంపి చాలా కాలం అవుతున్నా ఇంకా వాటికి సంబంధించి లోతైన విశ్లేషణ నివేదిక అందలేదని ప్రాసిక్యూషన్ కోర్టుకు వివరించింది. అలాగే కేసు తదుపరి విచారణలో భాగంగా గూగుల్ టేకవుట్, నిందితుడైన వైసీపీ ఎమ్మెల్సీ అనంతాబు కాల్ డేటా సేకరణ, హత్య సమయంలో నిందితుడితో ఉన్న కొందరు వ్యక్తులు, కుటుంబ సభ్యుల వాంగ్మూలాలు తీసు కోవాల్సి ఉందని వివరించింది. ఈ నేపథ్యంలో తదుపరి విచారణ లోతుగా చేపట్టి ఛార్జిషీట్ దాఖలకు ఐదు నెలల గడువు కోరింది. వీటన్నింటిని పరిశీలించిన న్యాయస్థానం మరో ఐదునెలల పాటు అదనపు గడువు మంజూరు చేసింది.

అప్పుడు ఏం జరిగింది..?

కాగా ప్రశాంత నగరంగా పేరొందిన కాకినాడ 2022 మేలో అట్టుడికిపోయింది. తన వద్ద పని చేసే దళిత డ్రైవర్ వీధి సుబ్రహ్మణ్యంను వైసీపీ ఎమ్మెల్సీ అనంతబాబు హత్య చేసి మృతదేహాన్ని ఏకంగా మృతుడి ఇంటికి డోర్ డెలివరీ చేశాడు. అప్పటి సీఎం జగన్‌కు అత్యంత సన్నిహితుడిగా పేరొందిన ఎమ్మెల్సీ అనంతబాబు 2022 మే 18న రాత్రి కాకినాడలో డ్రైవర్ సుబ్రహ్మణ్యం ఇంటికి వచ్చి పని ఉందని తీసుకువెళ్లాడు. ఆ తర్వాత కాకినాడ బీచ్‌రోడ్డులో నిర్జీవ ప్రదేశానికి తీసుకువెళ్లి బలమైన కర్రతో శరీరంపై 30చోట్ల దారుణంగా దాడి చేసి చిత్రహింసలకు గురి చేసి కొట్టి చంపాడు. తెల్లవారుజామున మే19న మృతదేహాన్ని స్వయంగా తన కారులో అనంతబాబు కాకినాడ కుళాయిచెరువు ఎదురుగా ఉన్న డ్రైవర్ ఇంటికే తీసుకువచ్చాడు. హత్యను రోడ్డు ప్రమాదంగా చిత్రీకరించే ప్రయత్నం చేశాడు. రోడ్డు ప్రమాదంలో సుబ్రహ్మణ్యం చనిపోయాడని ఆయన తల్లిదండ్రులను నమ్మించే ప్రయత్నం చేశాడు. తీరా కుటుంబీకులు తిరగబడ్డంతో అంత్యక్రియలకు డబ్బులు ఇస్తానని, నోరు తెరవొద్దని బెదిరించాడు. ఆగ్రహంతో బాధితులు నిలదీయడంతో కారు వదిలేసి అక్కడి నుంచి అనంతబాబు పారిపోయాడు. ఆ తర్వాత అరెస్టు అవకుండా ప్రయత్నించాడు. అధికారంలో ఉన్న వైసీపీ నేతల అండదండలతో మూడురోజులు ఓ ఇంట్లో మకాం వేశాడు. ప్రభుత్వ పెద్దలకు సన్నిహితుడు కావడంతో అనంతబాబు కోసం పోలీసులు కనీసం గాలించలేదు. ఆ తర్వాత మీడియా ఒత్తిడితో గాలింపు ముమ్మరం చేయగా, అదే సమయంలో హత్య తానే చేశానని పోలీసుల ఎదుట అనంతబాబు ప్రత్యక్షమయ్యాడు. తీరా అధికార పార్టీ ఒత్తిళ్లతో పోలీసులు కేసును నీరుగార్చడం కోసం కేవలం అనుమానాస్పద హత్యగా కేసు నమోదు చేయడానికి ప్రయత్నించారు. కానీ బాధితులు, దళితసంఘాలతో ఆందోళనతో చివరకు కేసును హత్యకేసుగా మార్చారు. ఆ తర్వాత అనంతబాబును అరెస్ట్ చేసి రాజమహేంద్రవరం సెంట్రల్‌జైలుకు తరలించారు. ఆ తర్వాత పోలీసులు దాఖలు చేసిన ఛార్జిషీటులోను అనంతబాబుకు అనుకూలంగా వ్యవహరించారు. అయితే సుదీర్ఘ కాలం జైల్లో గడిపిన అనంతబాబు మధ్యంతర బెయిల్‌పై ప్రస్తుతం స్వేచ్ఛగా బయటే తిరుగుతున్నాడు. కాగా హత్య కేసు ఆరోపణలతో అనంతబాబును పార్టీ నుంచి సస్పెండ్ చేస్తున్నట్లు ప్రకటించిన జగన్, ఆ తర్వాత బెయిల్‌పై బయటకు వచ్చిన అనంతబాబును పక్కన పెట్టుకుని వైసీపీ మంత్రులతోపాటు అప్పట్లో సీఎం జగన్ సైతం బహిరంగ సభలకు హాజరవడం తీవ్ర దుమారం రేపింది. అయితే ప్రభుత్వం మారాక కేసు విచారణ వేగం పుంజుకుంది. ఈ కేసుపై తొలి నుంచీ పోరాటం చేస్తోన్న ప్రముఖ న్యాయవాది ముప్పాళ్ల సుబ్బారావు సహకారం పోలీసులకు అవసరం అని ప్రభుత్వం భావించి కొంతకాలం కిందట ఆయన్ను ప్రాసిక్యూషన్‌కు సహకరించేందుకు నియమించింది. ఆ తర్వాత రాజమహేంద్రవరం న్యాయస్థానంలో కేసు మరింత లోతైన విచారణకు ప్రాసిక్యూషన్ కేసు దాఖలు చేయడగా, జులై 22 నుంచి 90 రోజుల్లోపు తదుపరి విచారణ పూర్తి చేసి ఛార్జిషీటు దాఖలు చేయాలని ఆదేశించింది.

రైలులో గంజాయి రవాణా

రూ.7 లక్షల విలువైన గంజాయిని స్వాధీనం చేసుకున్న సామర్లకోట పోలీసులు


సామర్లకోట రైల్వే స్టేషన్‌లో స్వాధీనం చేసుకున్న గంజాయితో పోలీసులు

సామర్లకోట, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా సామర్లకోట మీదుగా యశ్వంత్‌పూర్ వెళ్తున్న ఎక్స్‌ప్రెస్ రైలులో పెద్దఎత్తున గంజాయి రవాణా చేస్తున్నారన్న శుక్రవారం రాత్రి 10 గంటలకు వచ్చిన సమాచారంతో సామర్లకోట రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్ పోలీసులు, జీఆర్‌పీ పోలీసులు సంయుక్తంగా రైలులో తనిఖీలు నిర్వహించారు. ఎస్-1 బోగీ నుంచి ఎస్-6 బోగీ ల వరకూ సీట్ల కింద తనిఖీలు నిర్వహించగా 140 కిలోల పరిమాణంలో 15 బాక్స్‌లుగా ప్యాక్ చేసి గంజాయి రవాణా చేస్తున్నట్టు గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. ఆయా సీట్ల వద్ద ఉన్న ప్రయాణికులను ఆరా తీయగా తమకేమీ సంబంధం లేనట్టు చెప్పారని పోలీసులు తెలిపారు. స్వాధీనం చేసుకున్న గంజాయిని రైలు నుంచి కిందికి దింపి రైల్వే పోలీస్‌స్టేషన్‌కు తరలించామన్నారు. స్వాధీనం చేసుకున్న గంజాయి విలువ సుమారు రూ.7 లక్షల మేర ఉంటుందని పోలీసులు తెలిపారు. ఇంత పెద్ద మొత్తంలో గంజాయి రవాణా చేస్తున్న వారెవ్వరూ పట్టుబడకపోవడం గమనార్హం. స్వాధీనం చేసుకున్న గంజాయిని శనివారం సామర్లకోట మండల మెజిస్ట్రేట్ ఎదుట ఉంచుతామని, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఆర్‌పీఎఫ్ పోలీసులు తెలిపారు.

ఇద్దరు బైక్ దొంగలు అరెస్ట్

ఎనిమిది బైక్‌ల స్వాధీనం

రాజమహేంద్రవరం సిటీ, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరం సిటీ, రూరల్ ప్రాంతాల్లో బైక్‌లు దొంగతనం చేస్తున్న ఇద్దరిని టూటౌన్ పోలీసులు పట్టుకున్నారు. రాజమహేంద్రవరం రైల్వేస్టేషన్ వద్ద మమత రెస్టారెంట్ బయట పార్క్ చేసిన ఏపీ05 బీటీ 4855 నెంబరు గల బైక్‌ను ఈనెల 16న దొంగలు అపహరించారని బాధితుడు టూటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసిన పోలీసులు ఈనెల 23న వారికి వచ్చిన సమాచారం మేరకు ఈ బైక్ దొంగిలించుకుపోయిన ధవళేశ్వరం కాంచర లైన్‌కు చెందిన కశింకోట గనిరాజు అలియాస్ గని, సిర్రరాజా నిర్మలప్రసాద్‌ను అదుపులోకి తీసుకున్నారు. వారిని విచారించగా ధవళేశ్వరం పోలీస్ స్టేషన్ పరిధిలో దొంగిలించిన ఏడు బైక్‌లు, టూటౌన్ పరిధిలో అపహరించిన ఒక బైక్‌ను స్వాధీనం చేసుకున్నట్టు పోలీసులు తెలిపారు. నిందితులను రిమాండ్ నిమిత్తం కోర్టుకు తరలించినట్టు టూటౌన్ పోలీసులు తెలిపారు.

యువతిపై వైద్యుని కుటుంబం దాడి

కేసు నమోదు

అమలాపురం టౌన్, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): వివాహం నిశ్చయమైన యువతిపై వైద్యుని కుటుంబీకులు దాడి చేయడంతో ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ఘటన శుక్రవారం రాత్రి జరిగింది. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా అమలాపురం దుడ్డువారి అగ్రహారానికి చెందిన యువతికి కొంకాపల్లికి చెందిన విజయ ఆసుపత్రి వైద్యుడు డాక్టర్ గంటా బెనర్జీతో కొంతకాలం క్రితం వివాహం నిశ్చమైనట్టు యువతి ఆరోపిస్తూ శుక్రవారం ఆసుపత్రి వద్దకు కుటుంబ పెద్దలతో ఆందోళనకు దిగింది. తనను ఎందుకు పెళ్లి చేసుకోరని నిలదీయడంతో యువతిపై డాక్టర్ బెనర్జీ కుటుంబీకులు దాడి చేసినట్టు ఆమె ఆరోపించింది. అప్పటికే దాడిలో గాయపడ్డ ఆమెను అమలాపురంలోని ఆసుపత్రికి చికిత్స నిమిత్తం తరలించారు. డాక్టర్ బెనర్జీ కుటుంబ సభ్యులపై యువతి దాడికి పాల్పడినట్టు ఆయన కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారు. కానీ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న యువతి నుంచి అందిన ప్రాథమిక సమాచారం మేరకు పట్టణ పోలీసులు ఆసుపత్రి వద్దకు చేరుకుని వివరాలు సేకరిస్తున్నారు. ఈ ఘటన సామాజిక మాధ్యమాల్లో వైరల్ కావడంతో అమలాపురం డీఎస్పీ టీఎస్ఆర్కే ప్రసాద్‌తో పాటు అధికారులు అప్రమత్తమయ్యారు. యువతి తాళ్ల ప్రజ్ఞ ఇచ్చిన ఫిర్యాదు మేరకు డాక్టర్ రత్నబెనర్జీ, విజయ్‌బెనర్జీ, రత్నకుమారిపై కేసు నమోదు చేసినట్టు పట్టణ సీఐ వీరబాబు తెలిపారు.

పిడుగుపాటుకు గృహోపకరణాల ధ్వంసం

ఐ.పోలవరం, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా ఐ.పోలవరం మండలం మురమళ్లకు చెందిన టీడీపీ మాజీ ఎంపీటీసీ, బీసీ రాష్ట్ర అధికార ప్రతినిధి గంజా సుధాకర్ ఇంటిపై గురువారం రాత్రి పిడుగు పడి గృహం, గృహోపకరణాలు ధ్వంసమయ్యాయి. ఆ సమయంలో ఇంట్లో ఎవరూ లేకపోవడంతో ప్రాణనష్టం జరగలేదు. రిఫ్రిజిరేటర్, టీవీ, ఫ్యాన్లు, విద్యుత్ వైరింగ్ ధ్వంసమయ్యాయి. ముమ్మిడివరం ఎమ్మెల్యే దాట్ల బుచ్చిబాబు శుక్రవారం దెబ్బతిన్న ఇంటిని పరిశీలించారు. జరిగిన ప్రమాదంపై ఆవేదన వ్యక్తం చేశారు. ఆయన వెంట టీడీపీ రాష్ట్ర కార్యదర్శి నాగిడి నాగేశ్వరరావు, వీరేశ్వరస్వామి దేవస్థానం చైర్మన్ దాట్ల రామకృష్ణంరాజు, జంపన బాబు, రాయపురెడ్డి మాణిక్యం, ఏలూరి మూర్తి, గంజా శ్రీనివాస్, సవరపు కొండ,వెంకటేశ్వరరావు ఉన్నారు.


మురమళ్ళలో దెబ్బతిన్న ఇంటిని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే దాట్ల బుచ్చిబాబు

నకిలీ మద్యం విక్రయిస్తే కఠిన చర్యలు

ఎక్సైజ్ సురక్ష యాప్‌తో నకిలీ మద్యానికి చెక్ : మంత్రి సుభాష్


రామచంద్రపురంలో సురక్ష యాప్ పోస్టర్‌ను ప్రదర్శిస్తున్న మంత్రి సుభాష్

రామచంద్రపురం(ద్రాక్షారామ), అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): నకిలీ మద్యాన్ని విక్రయిస్తే ఉపేక్షించబోమని, కూటమి ప్రభుత్వం రాష్ట్ర ప్రజలకు నాణ్యమైన మద్యం సరఫరా చేస్తుందని మంత్రి సుభాష్ తెలిపారు. శుక్రవారం రాత్రి డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా రామచంద్రపురం బస్టాండు సమీపంలో ఆర్‌ఆర్ వైన్ షాపును ఆయన పరిశీలించారు. కూటమి అధికారంలోకి వచ్చిన తరువాత ప్రత్యేక మద్యం విధానం తీసుకువచ్చి నాణ్యమైన మద్యాన్ని అందుబాటులోకి తెచ్చిందన్నారు.ముఖ్యంగా అక్రమ మద్యం అమ్మకాలు అరికట్టేందుకు, నాణ్యతను తెలుసుకునేందుకు ప్రభుత్వం ఎక్సైజ్ సురక్షయాప్‌ను రూపొందించిందని తెలిపారు. మద్యాన్ని కొనుగోలు చేసిన వారు బాటిల్‌పై ఉన్న క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేసి తాము కొనుగోలు చేసిన మద్యం నకిలీదా, నాణ్యమైనదా తెలుసుకోవచ్చన్నారు. గత ప్రభుత్వం జే(బ్రాండ్స్ మద్యం పాలసీతో ఇష్టానుసారంగా నాసిరకం మద్యం అమ్మకాలు చేసి ప్రజల ఆరోగ్యాలతో చెలగాటం ఆడిందన్నారు. సురక్షయాప్ వినియోగంపై ప్రతీ గ్రామంలోను అవగాహన కల్పించాలని కోరారు. యాప్‌తో మద్యం ఎక్కడ, ఎప్పుడు, ఏ కంపెనీలో తయారయ్యిందో, రేటు కూడా తెలుసుకోవచ్చన్నారు. నకిలీ మద్యం తయారీ కాకుండా ప్రభుత్వం చర్యలు తీసుకుందని మంత్రి తెలిపారు. ఎక్సైజ్ సీఐ పి.శ్రీనివాస్, ఎస్ఐలు ఉన్నారు.

భార్యను చాకుతో పొడిచిన భర్త అరెస్ట్

14 రోజుల రిమాండ్

పి.గన్నవరం, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా పి.గన్నవరం మండలం ఉడిమూడిలో ఈనెల 20న భార్యను చాకుతో పొడిచిన భర్తను శుక్రవారం అరెస్ట్ చేసి కొత్తపేట కోర్టుకు తరలించగా రిమాండ్ విధించారు. ఎస్ఐ బి.శివకృష్ణ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. గ్రామానికి చెందిన నేలపూడి గంగరాజు తన భార్య పల్లాలమ్మ(పల్లవి)తో ప్రతిరోజు గొడవపడుతూ పిల్లలను కొట్టేవాడు. చాకుతో చంపుతానని బెదిరించేవాడు. ఈ క్రమంలోనే దీపావళి రోజున భార్యపిల్లలతో గొడవపడుతూ భార్యను చాకుతో పొడిచాడు. పిల్లలు గట్టిగా అరవడంతో గంగరాజు అక్కడ నుంచి పారిపోయాడు. పల్లాలమ్మ ప్రస్తుతం ఆసుపత్రిలో చికిత్స పొందుతుందని, పరారీలో ఉన్న గంగరాజును సమాచారం మేరకు ఉడిమూడి గ్రామంలో అదుపులోకి తీసుకున్నామని ఎస్ఐ తెలిపారు. వైద్య పరీక్షల అనంతరం కొత్తపేట కోర్టుకు తరలించగా మెజిస్ట్రేట్ 14 రోజుల పాటు రిమాండ్ విధించగా గంగరాజును రాజమహేంద్రవరం సెంట్రల్ జైలుకు తరలించారు.

మహిళతో అసభ్యంగా ప్రవర్తించిన
వ్యక్తికి ఐదేళ్ల జైలు

తొండంగి, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): మహిళతో అసభ్యంగా ప్రవర్తించిన కేసులో నిందితుడికి న్యాయమూర్తి ఐదు సంవత్సరాల జైలు శిక్ష, రూ.3వేల జరిమానా విధించినట్టు తొండంగి ఎస్ఐ జగన్మోహన్ తెలిపారు. 2016లో కాకినాడ జిల్లా తొండంగి మండలం ఏ.కొత్తపల్లి గ్రామానికి చెందిన కొల్లూరి హరిప్రియ అనే మహిళ పట్ల గూటూరి సత్తిబాబు అనే వ్యక్తి ఎవరూలేని సమయంలో అసభ్యంగా ప్రవర్తించినట్టు ఇచ్చిన ఫిర్యాదు మేరకు అప్పటి ఎస్ఐ కృష్ణమాచారి కేసు నమోదు చేసి ఛార్జిషీటు దాఖలు చేశారు. వాదోపవాదనలు విన్న తుని జూనియర్ సివిల్‌జడ్జి కోర్టు మేజిస్ట్రేట్ లంకా గోపీనాథ్ శుక్రవారం నిందితుడికి ఐదేళ్ల జైలు శిక్ష, రూ.3వేల జరిమానా విధించినట్టు ఎస్ఐ జగన్మోహన్ తెలిపారు. తుని రూరల్ సీఐ చెన్నకేశవరావు కేసు పర్యవేక్షించగా కోర్టు కానిస్టేబుల్ తాతాజీ సాక్షుల్ని ప్రవేశపెట్టారు.

పేకాడుతున్న 13 మంది అరెస్ట్

కడియం, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): తూర్పుగోదావరి జిల్లా కడియం మండలం వీరవరంలో పేకాడుతున్నట్టు సమాచారం రావడంతో సీఐ ఎ.వెంకటేశ్వరరావు ఆదేశాల మేరకు ఎస్ఐ బి.దుర్గాప్రసాద్ దాడి చేశారు. వీరవరంలో బి.సుధీర్ నర్సరీ టైల్‌షెడ్‌లో పేకాడుతున్న 13 మందిని అరెస్టు చేశారు. వారి నుంచి రూ.13,050 నగదును స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్టు పోలీసులు తెలిపారు.

యుక్తధార పోర్టల్‌తో ఉపాధి హామీ పనులు

జాతీయ గ్రామీణాభివృద్ధి శిక్షణా సంస్థ అసిస్టెంట్ ప్రొఫెసర్ ప్రసాద్


సామర్లకోటలో ప్రసంగిస్తున్న ప్రసాద్

సామర్లకోట, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): జాతీయ ఉపాధి హామీ పథకం ద్వారా ఇకనుంచి అమలుచేయనున్న అభివృద్ధి పనులన్నీ యుక్తధార పోర్టల్ సాంకేతిక పరిజ్ఞానంతోనే చేయాలని జాతీయ గ్రామీణాభివృద్ధి శిక్షణా సంస్థ అసిస్టెంట్ ప్రొఫెసర్ ఎన్ఎస్ఆర్.ప్రసాద్ పేర్కొన్నారు. కాకినాడ జిల్లా సామర్లకోట విస్తరణ శిక్షణా కేంద్రం ఆవరణలో ఉపాధి హామీ పథకం టెక్నికల్ అసిస్టెంట్లు, జూనియర్ ఇంజనీర్లకు నిర్వహిస్తున్న శిక్షణా తరగతులకు ముఖ్య అతిథిగా అసిస్టెంట్ ప్రొఫెసర్ ప్రసాద్ హాజరయ్యారు. విస్తరణ శిక్షణాకేంద్ర ప్రిన్సిపాల్ కెఎన్వీప్రసాదరావు ఆధ్వర్యంలో నిర్వహించిన శిక్షణా తరగతుల్లో ప్రసాద్ మాట్లాడుతూ జాతీయ ఉపాధి హామీ పథకం పనుల ప్రణాళికలో రాష్ట్రవ్యాప్తంగా 30 శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. జీఐఎస్, జీపీఎస్, డ్రోన్ సాంకేతికలపై సామర్లకోట విస్తరణ శిక్షణా కేంద్రంలో 3రోజుల పాటు ఒక్కొక్క బ్యాచ్‌కు శిక్షణ ఇస్తామన్నారు.ప్రిన్సిపాల్ ప్రసాదరావు మాట్లాడుతూ సామర్లకోట విస్తరణ శిక్షణా కేంద్రంలో ఆహ్లాదకరమైన వాతావరణంలో సబ్జెక్ట్ నిపుణులు, రెసిడెన్షియల్ పద్ధతిలో ఇస్తున్న 3రోజుల శిక్షణా తరగతులను సద్వినియోగం చేసుకుని క్షేత్రస్థాయిలో ఉత్తమ ఫలితాలు సాధించి ప్రభుత్వ లక్ష్యాలను చేరుకోవాలని కోరారు. శిక్షణా కేంద్రంలో శ్రీకాకుళం, విజయనగరం, విశాఖ, తూర్పుగోదావరి, పశ్చిమ గోదావరి జిల్లాలకు చెందిన ఉపాధి హామీ సిబ్బంది 320 మందికి 8 బ్యాచ్‌లుగా శిక్షణ ఇచ్చేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని తెలిపారు. కార్యక్రమంలో చీఫ్ ఇన్‌స్ట్రక్టర్ డి.శ్రీనివాసరావు, డీడీవో శర్మ, నరేగా అధ్యాపకులు సాగర్, మంగాలక్ష్మి, సూర్యావతి, 5 జిల్లాలకు చెంది టీఏలు, జేఈలు పాల్గొన్నారు.

డొంకరాయి జలాశయం నుంచి
4వేల క్యూసెక్కుల నీరు విడుదల

మోతుగూడెం, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): సీలేరు కాంప్లెక్స్ పరిధిలోని డొంకరాయి జలాశయం నుంచి 4వేల క్యూసెక్కుల నీటిని దిగువకు శుక్రవారం విడుదల చేసినట్టు జెన్‌కో అధికారులు తెలిపారు. డొంకరాయి జలాశయం జలాశయం పూర్తిస్థాయి నీటి మట్టం 1037 అడుగులు కాగా అల్పపీడన ద్రోణి ప్రభావంతో డొంకరాయి జలాశయం ఎగువ ప్రాంతాల్లో ఇటీవల కురుస్తున్న భారీ వర్షాలకు 1036.60 అడుగులకు చేరుకోవడంతో జలాశయం పెరగకుండా చర్యలు చేపట్టారు. ఈ మేరకు గురువారం రాత్రి గేటు ద్వారా 2 వేల క్యూసెక్కులను దిగువకు విడుదల చేసినప్పటికీ భారీగా కురుస్తున్న వర్షానికి ఇన్‌ఫ్లోస్ వచ్చి చేరుతున్న నేపథ్యంలో శుక్రవారం ఉదయం నుంచి జలాశయం 6, 7 నెంబర్ గేట్లు ఎత్తి వాటి ద్వారా 4వేల క్యూసెక్కుల నీటిని విడుదల చేశామని జెన్‌కో అధికారులు తెలిపారు. అలాగే పొల్లూరు జల విద్యుత్ కేంద్రానికి విద్యుత్ ఉత్పత్తి కోసం మరో 4వేల క్యూసెక్కులను కెనాల్‌కు విడుదల చేస్తున్నామన్నారు. ప్రస్తుతం డొంకరాయి జలాశయానికి పరీవాహక ప్రాంతాల నుంచి 8వేల క్యూసెక్కుల వరకు ఇన్‌ఫ్లోస్ వస్తున్నాయని, ఇన్‌ఫ్లోస్ తగ్గేంత వరకు దిగువకు నీటి విడుదల కొనసాగుతుందని ఏపీ జెన్‌కో ఏఈఈ శివశంకర్ తెలిపారు.

నీటిని విడుదల చేస్తున్న దృశ్యం



పోలీసులకు చిక్కిన అంతర్‌రాష్ట్ర గజదొంగ


గజదొంగ చింతా గణేష్

అల్లవరం, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా అల్లవరం మండలం మొగళ్లమూరుకు చెందిన అంతర్‌రాష్ట్ర గజదొంగ చింతా గణేష్ అరెస్టు అయ్యాడు. ఇతడిపై పలు పోలీసుస్టేషన్లలో కేసులు నమోదయ్యాయి. భక్తులు ఆలయాల వద్ద కారులు ఆపి ముందుజాగ్రత్తగా తమ బంగారు ఆభరణాలను తీసి కార్లలో పెట్టి లాక్ వేసుంటారు. అయితే ఆలయాలకు వెళ్లే వారిని గణేష్‌పై టార్గెట్ చేస్తుంటాడు. చాకచక్యంగా కార్ల ఫ్రంట్ గ్లాస్ దింపి బంగారు వస్తువులతో పరారవుతుంటాడు. అమలాపురం పోలీసులకు చిక్కిన ఈ దొంగ ఇటీవల తుని పోలీసుల వలలో పడ్డాడు. విజయవాడలో చేసిన రెండు పెద్ద దొంగతనాల వివరాలు బయట పెట్టడంతో ఆభరణాలు రికవరీ చేసే పనిలో తుని పోలీసులు ఉన్నారు. దాదాపు రూ.2 కోట్ల పైబడి సొత్తు ఉంటుందని పోలీసులు అంచనా వేస్తున్నారు.

పొలంలో జారిపడి గిరిజనుడి మృతి


శ్రీనివాసరావు మృతదేహం

వై.రామవరం, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): అల్లూరి జిల్లాలో ఓ గిరిజనుడు పొలం పనులకు వెళ్లి ప్రమాదవశాత్తు జారి పడి మృతి చెందాడు. వివరాల్లోకి వెళ్తే.. కొయ్యూరు మండలం మంప పంచాయితీ ఆర్.దొడ్డవరం గ్రామానికి చెందిన మొట్టడం శ్రీనివాసరావు (5 0) గురువారం రాత్రి పొలం వద్ద కాపలాకు వెళ్లాడు. శుక్రవారం ఉదయం పనులు చేస్తుండగా చాపరాయిపై నాచు పట్టడంతో జారిపడ్డాడు. అంబులెన్స్‌లో సరిహద్దున ఉన్న వై.రామవరం సీహెచ్‌సీకి తీసుకురావడంతో అప్పటికే మృతి చెందినట్టు ఆసుపత్రి సూపరిండెంట్ చైతన్యకుమార్ తెలిపారు. మృతదేహన్ని పోస్టుమార్టానికి అడ్డతీగల ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. దీనిపై మంప పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

శంఖవరంలో డెంగ్యూ కలకలం

శంఖవరం, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా శంఖవరం వైష్ణవమాన్యం కాలనీలో డెంగ్యూ కలకలం రేగింది. కాలనీకి చెందిన మహిళ డెంగ్యూ లక్షణాలతో ఆసుపత్రిలో చేరడంతో సిబ్బంది అప్రమత్తమయ్యారు. పలువురి నుంచి రక్త నమూనాలు సేకరించి ల్యాబ్‌కు తరలించారు. వైద్యసిబ్బంది, పంచాయితీ సిబ్బంది ఆ కాలనీని జల్లెడపట్టారు. వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నట్టు వైద్యులు తెలిపారు. దోమల మందుకొట్టి మురుకినీరు చేరకుండా చూసుకోవాలని గ్రామస్తులకు సూచించారు. పారిశుధ్య లోపం కారణంగానే ప్రజలు రోగాల బారిన పడుతున్నారని పలువురు చెప్పారు.


శంఖవరంలో పారిశుధ్య చర్యలు చేపడుతున్న సిబ్బంది

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం
మామిడికుదురు, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): నగరం సబ్‌స్టేషన్ పరిధిలో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని అమలాపురం ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కె.రాంబాబు తెలిపారు. శనివారం ఆర్డీఎస్ఎస్ పనుల నిమిత్తం అప్పనపల్లి, పెదపట్నం, పెదపట్నం అగ్రహారం, తాటిపాక, మొగలికుదురు గ్రామాల్లో సరఫరా ఉండదన్నారు.

సమన్వయంతో గ్రామాల అభివృద్ధికి కృషి చేయాలి

ముమ్మిడివరం మండల సమావేశంలో ఎంపీపీ

ముమ్మిడివరం, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): అధికారులు, ప్రజాప్రతినిధులు పరస్పర సహకారంతో ప్రజా సమస్యలు పరిష్కరించి గ్రామాల అభివృద్ధికి కృషి చేయాలని ఎంపీపీ కోలా గంగాభవానీ సూచించారు. స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో శుక్రవారం జరిగిన సర్వసభ్య సమావేశానికి ఆమె అధ్యక్షత వహించి మాట్లాడారు. అల్పపీడనం కారణంగా కురుస్తున్న భారీ వర్షాలకు వరి పొలాలు నష్టపోయే ప్రమాదం ఉన్నందున నష్టాలను నమోదుచేసి రైతులను ఆదుకోవాలని ఆమె వ్యవసాయ అధికారి ఎస్.ప్రశాంత్‌కుమార్‌ను ఆదేశించారు. పంటకాల్వలు, మురుగునీటి కాల్వల్లో పూడికతీతకు చర్యలు తీసుకోవాలని ఎంపీపీ కోలా గంగాభవానీ, జడ్పీటీసీ కుడుపూడి శంకరరావులు ఏపీవో రామారావుకు సూచించారు. అయినాపురం పెదమెట్టలంకలో జలజీవన్ మిషన్ పథకంలో మంచినీటి ట్యాంకును నిర్మించి పైపులైను పూర్తయినా ప్రజలకు తాగునీరు అందడం లేదని వైస్ ఎంపీపీ మట్టపర్తి సురేష్ ఆవేదన వ్యక్తం చేశారు. రోడ్డుకు మూడు మీటర్ల దూరంలో కుళాయిలు ఏర్పాటుచేస్తే బాగుండేదని, కుళాయిల ఏర్పాటులో కూడా రాజకీయాలు చేస్తే ఎలా అని గ్రామ సర్పంచ్ మోకా రామారావు ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై ఆర్‌డబ్ల్యుఎస్ ఏఈ నానాజీ మాట్లాడుతూ త్వరలోనే మంచినీటి సమస్య పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. ముమ్మిడివరం-కాట్రేనికోనఆర్‌అండ్‌బీ రోడ్డు వైసీపీ ప్రభుత్వ హయాంలో రూ.23.52కోట్ల నిధులు మంజూరుచేస్తే కాంట్రాక్టరు ఆ పనులు చేపట్టకపోవడం వల్ల రోడ్డు ఆధునికీకరణ పూర్తి అవలేదని, అధికారంలోకి వచ్చి 18నెలలు అయినా ఇప్పటి వరకు ఆ రోడ్డు పనులు ఎందుకు పూర్తి చేయలేకపోయారని, కేవలం రూ.3.90కోట్లు మాత్రమే మంజూరు చేయించారని, ఆ నిధులు ఏ మేరకు సరిపోతాయని సర్పంచ్ రామారావు ఆవేదన వ్యక్తం చేశారు. పంచాయతీరాజ్ డీఈఈ పాలకొల్లు విజయ్‌శ్రీనివాస్



మాట్లాడుతున్న ఎంపీపీ కోలా గంగాభవానీ

మాట్లాడుతూ పల్లె పండుగ పథకంలో గత ఏడాది 33పనులకు రూ.33.84కోట్లు మంజూరు కాగా 26పనులు పూర్తయ్యాయని, ఇంకా ఏడు పనులు వివిధదశల్లో ఉన్నాయన్నారు. 2025-26 సంవత్సరానికి 16పనులకు రూ.2.99కోట్లు మంజూరు కాగా ఒక పని పూర్తయిందని, రెండు పనులు వివిధ దశల్లో ఉన్నాయన్నారు. మండలంలో ఆరు గ్రామాల్లో హెల్త్ క్లినిక్‌ల నిర్మాణానికి రూ.36లక్షల వంతున నిధులు మంజూరైనట్టు ఆయన తెలిపారు. హౌసింగ్ ఏఈ కేవీస్వీ దొరబాబు మాట్లాడుతూ గతంలో1124ఇళ్లు మంజూరు కాగా 634ఇళ్లు పూర్తయ్యాయని, మరో 579 ఇళ్ల నిర్మాణాలకు దరఖాస్తులు వచ్చాయన్నారు. డిప్యూటీ తహశీల్దార్ గోపాలకృష్ణ మాట్లాడుతూ అర్బన్‌లో 1336, రూరల్‌లో 2154ఇళ్ల పట్టాలు ఇవ్వగా మరో 130మంది ఇళ్ల పట్టాలకు దరఖాస్తులు చేసుకున్నారన్నారు. ఎంపీడీవో జేఎల్ఎన్ దీక్షితులు మాట్లాడుతూ రేషన్‌కార్డులో ఉన్న తప్పులు అప్‌డేట్ చేసుకోవడం వల్ల భవిష్యత్తులో సమస్యలు తలెత్తవని, ఆధార్ సెంటర్‌లో వాటిని అప్‌లోడ్ చేసుకోవాలని సూచించారు. మండల పరిషత్ డిప్యూటీ అభివృద్ధి అధికారి బహ్మానందం మాట్లాడుతూ ఇంటి పనులు స్వర్ణ పంచాయతీ యాప్‌ల ద్వారా చెల్లించుకోవచ్చన్నారు. వ్యవసాయాధికారి ఎస్.ప్రశాంత్‌కుమార్, ఏపీవో రామారావు, ఏఎంపీ రమణ, ఆర్టీసీ, ఉద్యాన, ఐసీడీఎస్ అధికారులు ఆయా శాఖల ద్వారా పథకాల గురించి వివరించారు. జడ్పీటీసీ కుడుపూడి శంకరరావు, వైస్‌ఎంపీపీ పాము నాగవేణి, మట్టపర్తి సత్యనారాయణ, మండల పరిపాలనాధికారి టీఎస్ శేషగిరిరావు, ఎంఈవో గౌరీశంకర్, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు, సొసైటీ అధ్యక్షులు పాల్గొన్నారు.

వైద్యుల మధ్య విభేదాలపై సీహెచ్‌సీలో విచారణ



మత్తు వైద్యురాలికి వ్యతిరేకంగా స్థానికుల నిరసన

పి.గన్నవరం, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): వైద్యుల మధ్య విభేదాలు నేపథ్యంలో వచ్చిన ఫిర్యాదులపై స్థానిక సీహెచ్‌సీలో విచారణ నిర్వహించినట్లు విచారణ అధికారి విజయనగరం డీసీహెచ్ఎస్ డాక్టర్ ఎన్.పద్మావతి తెలిపారు. శుక్రవారం వైజాగ్ నుంచి వచ్చిన సీఎస్ఎస్ డాక్టర్ ఎం.ప్రసన్నలక్ష్మితో కలిసి ఆమె విచారణ నిర్వహించారు. విచారణ అధికారులు సిబ్బందిని ఒక్కొక్కర్ని లోపలకు పిలిచి విచారణ నిర్వహించారు. దీంతో పార్టీలకు అతీతంగా నాయకులు, ట్రస్ట్ సభ్యులు, రోగులు ఆసుపత్రికి చేరుకున్నారు. సూపరింటెండెంట్‌పై అసత్య ఆరోపణలు చేస్తూ ఫిర్యాదు చేశారని, విచారణను వెంటనే నిలిపి వేయాలని వారు డిమాండ్ చేశారు. ఉద్దేశ పూర్వకంగా సూపరిటెండెంట్‌పై ఇచ్చిన ఫిర్యాదును ఉపసంహరించుకోవాలని, మత్తువైద్యురాలు 24గంటలు అందుబాటులో ఉండాలని, ఆమెపై చర్యలు తీసుకోవాలని ప్లకార్డులతో నిరసన చేపట్టారు. సూపరింటెండెంట్ డాక్టర్ యు.రాఘవేంద్రరావు చేస్తున్న శస్త్రచికిత్సలు, ఇటీవల ఆసుపత్రిలో జరిగిన పరిణామాలను ఎంపీపీ గనిశెట్టి నాగలక్ష్మి, ట్రస్ట్ చైర్మన్ భీమాల వెంకటేశ్వరరావు, సభ్యులు కోట రాజేంద్రప్రసాద్, గుడాల సంపదరావు, నాయకులు తాటికాయల శ్రీనివాసరావు, కొక్కిరి రవి కుమార్, దొమ్మేటి దుర్గారావులు విచారణ అధికారులకు వివరించారు. సూపరిం టెండెంట్ శస్త్రచికిత్స విషయంలో మాదగ్గర ఏవిధమైన డబ్బులు వసూలు చేయలేదని చికిత్స పొందిన రోగులు విచారణ అధికారులకు వివరించారు.

ప్రాధాన్యతా క్రమంలో రోడ్ల అభివృద్ధి

మామిడికుదురు, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): రాజోలు నియోజకవర్గంలో ప్రాధాన్యతా క్రమంలో రోడ్లను అభివృద్ధి చేస్తున్నట్టు రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్, టీడీపీ రాజోలు నియోజకవర్గ ఇన్‌చార్జి గొల్లపల్లి అమూల్య పేర్కొన్నారు. గెద్దాడ గ్రామంలో రూ.60లక్షలతో నిర్మించే రోడ్డు అభివృద్ధి పనులను శుక్రవారం ప్రారంభించారు. ఈసందర్భంగా జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ప్రజలకు అవసరమైన అన్ని మౌలిక సదుపాయాలు కల్పించడానికి కృషి చేస్తుందన్నారు. సంక్షేమంతో పాటు అభివృద్ధికి పెద్దపీట వేస్తుందని తెలిపారు. ప్రజల అవసరాలు గుర్తించి వారి అవసరాలను తీర్చే విధంగా ప్రభుత్వం పనిచేస్తుందన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ గుబ్బల గీతాభవానీ, ఎంపీటీసీ జవ్వాది పద్మావతి, గోదావరి సెంట్రల్ ప్రాజెక్టుకమిటీ చైర్మన్ గుబ్బల శ్రీనివాస్, టీడీపీ మండలశాఖ అధ్యక్షుడు మొల్లేటి శ్రీనివాస్, కుసుమ శ్రీధర్, విత్తనాల జానకీరామ్, లంకే శ్రీనివాస్, కాట్రేనిపాడు నాగేంద్ర, కూటమి నాయకులు పాల్గొన్నారు.



గెద్దాడలో రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్

భారీ వర్షం.. లోతట్టు ప్రాంతాలు జలమయం

- పొంగి ప్రవహించిన డ్రైనేజీలు
- స్తంభించిన జనజీవనం





అంతర్వేదిలో జలమయమైన ఎల్ఎఫ్ చానల్ ప్రధాన రహదారి, కాట్రేనికోన మండలంలో ముంపునకు గురైన వరిచేలు

అంబాజీపేట, అక్టోబరు24(ఆంధ్రజ్యోతి): బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనంతో మూడు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. డ్రైనేజీలు పొంగి ప్రవహించడంతో మురుగునీరు రహదారుల్లో నిలిచిపోయింది. రహదారులు కాలువలను తలపిస్తున్నాయి. శుక్రవారం ఉదయం నుంచి ఎడతెరిపి లేకుండా భారీ వర్షానికి జనజీవనం స్తంభించింది. కొబ్బరి, అరటి తోటల్లోకి వర్షం నీరు చేరింది. వరిచేలు పలు చోట్ల నేలకొరిగాయి. పలు చోట్ల చెట్లు విరిగిపడటంతో ఆయా గ్రామాల సర్పంచ్‌లు, స్థానికులు, విద్యుత్ శాఖాధికారులు అడ్డుగా పడి ఉన్న చెట్లను తొలగించి విద్యుత్ సరఫరానుపునరుద్ధరించారు. గ్రామాల్లో అధికారులు అప్రమత్తంగా ఉండాలని మండల స్థాయి అధికారులు సూచించారు.

నేలకొరిగిన వరి చేలు

ముమ్మిడివరం, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): అల్పపీడనం కారణంగా కురుస్తున్న భారీ వర్షాలతో మండలంలో పలు లోతట్టు ప్రాంతాలు వర్షంతో నీట మునిగాయి. ముమ్మిడివరంలో శుక్రవారం ఉదయం 8గంటలకు 90మిల్లీమీటర్ల వర్షపాతం నమోదు కాగా సాయంత్రానికి మరో 39.4మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. ఎడతెరిపి లేకుండా కుండపోతగా వర్షం కురవడంతో రోడ్లు, డ్రైనేజీలు చెరువులను తలపిస్తున్నాయి. ముమ్మిడివరంలోని తహశీల్దార్ కార్యాలయ ఆవరణ, ఆసుపత్రుల వీధి, కుమ్మర్లవీధి, ఆర్టీసీ బస్టాండు రోడ్డు, టెలిఫోన్‌ఎక్స్ఛేంజ్ వీధి, బాలయోగి కాలనీ, సాయినగర్‌తో పాటు పలు ఇందిరమ్మ కాలనీలు వర్షం నీట మునిగాయి. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఏకధాటిగా వర్షం పడడంతో జనజీవనం స్తంభించింది. అక్కడక్కడా వరిచేలు నేలకొరిగాయి. పంటకాల్వలు, ముగురునీటి కాల్వలుపొంగి ప్రవహిస్తున్నాయి.

ముంపు బారిన 950 ఎకరాలు

కాట్రేనికోన, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): మండలంలో 5428 ఎకరాల్లో సార్వా సాగుచేయగా వర్షాలకు 950ఎకరాలు ముంపునకు గురైనట్టు వ్యవసాయాధికారిణి బి.మృదుల తెలిపారు. పొలంలో నీటిని బయటకు పంపించాలన్నారు. ఎకరానికి 30కిలోల యూరియా, 15కిలోల పొటాష్ వెయ్యాలన్నారు. పొడ తెగులు వచ్చే అవకాశమున్నందున నివారణకు ప్రోపకొనాజోల్ 1మి.లీ లేదా వాలిడామైసిన్ 2మి.లీ లేదా హెకాకొనాజోల్ 2మి.లీ ఒక లీటరు నీటికి కలిపి పిచికారీ చెయ్యాలన్నారు. అగ్గి తెగులు నివారణకు ట్రైసైక్లోజోల్ 0.6 గ్రాములు లేదా కాస్గామైసిన్ 2మి.లీ లేదా ప్యాజివన్ 2మి.లీ లీటరు నీటికి కలిపి పిచికారీ చెయ్యాలన్నారు. సుడిదోమ నివారణకు ఇతోఫెన్మాకసా 2మి.లీ లేదా 1.5 గ్రాముల ఎసిఫేట్ లేదా 0.25మి.లీ ఇమిడాక్లోప్రిడ్ లేదా 0.20 గ్రాముల దయోమిదోకామ్ లేదా డైనెటోప్యూరాన్ 0.25గ్రాములు లేదా బిపోఫ్యూజన్ 1.6 మి.లీ తేదా 2మి.లీ బీపయూంసీ లేదా మోనోకోరటోఫాస్ 2.2 మి.లీ ఒక లీటరు నీటికి కలిపి పిచికారీ చెయ్యాలని వివరించారు.

అమలాపురం ఇన్‌చార్జి ఏజీపీగా రజిత

రాజోలు, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): అమలాపురం ఇన్‌చార్జి అసిస్టెంట్ గవర్నమెంట్ ప్లీడరుగా గుబ్బల రజిత నియమితులయ్యారు. కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ నుంచి ఉత్తర్వులు తనకు అందాయని తెలిపారు. ఇప్పటి వరకు అమలాపురం ఏజీపీగా పనిచేసిన వి.చంద్రశేఖరరావు పదవీ కాలం పూర్తి అవడంతో రాజోలు కోర్టులో ఏజీపీగా పనిచేస్తున్న రజితకు అమలాపురం సీనియర్, జూనియర్ కోర్టు అసిస్టెంట్ గవర్నమెంట్ ప్లీడర్‌గా ప్రభుత్వం అదనపు బాధ్యతలు అప్పగించింది.

బుర్రకథ బృందంతో అవగాహన

అల్లవరం, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): బోడసకుర్రు గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద రాజమహేంద్రవరం గెయిల్ ఇండియా ఆధ్వర్యంలో సహజ వాయువు పైపులైను భద్రతపై శుక్రవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. గొర్రెల కృష్ణమూర్తి, గొర్రెల రాము కళాకారుల బృందం గెయిల్ ఇండియా ద్వారా వచ్చే పైపులైన్ల వల్ల కలిగే ప్రమాదాలు, గ్యాస్ లీకేజీ వంటి సంఘటనలు జరిగినప్పుడు ప్రజలు ఎటువంటి భయానికి గురికాకుండా వెంటనే గెయిల్ ఇండియా టోల్ ఫ్రీ నంబరుకు లేదా పక్కనే ఉన్న ప్లాంటు దగ్గరికి వెళ్లి సమాచారం అందించాలని వివరించారు. సర్పంచ్ రొక్కాల విజయలక్ష్మి నాగేశ్వరరావు, పంచాయతీ కార్యదర్శులు బి.ఆదిశంకరం, సచివాలయఉద్యోగులు పాల్గొన్నారు.

నేల కొరిగిన భారీ వృక్షం



ఉప్పలగుప్తం, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): భారీ వర్షానికి చల్లపల్లి గంగరాజు కాలనీ దగ్గర ఒక భారీ వృక్షం నేలకూలింది. అమలాపురం-చల్లపల్లి ఆర్ అండ్‌బీ రహదారిపై కూలిన ఈ వృక్షం కారణంగా రాకపోకలకు అంతరాయం కలిగింది. సరిపల్లి సర్పంచ్ గెడ్డం స్వరూపాసురేష్‌బాబు వెంటనే స్పందించి ఆ చెట్టును నరికించి అక్కడి నుంచి తొలగించి, ట్రాఫిక్‌ను పునరుద్ధరించారు.

చెత్తను యార్డుకు తరలించే వరకు దీక్ష విరమించేది లేదు



జిల్లా పంచాయతీ అధికారి శాంతలక్ష్మితో మాట్లాడుతున్న నాయకులు

అమలాపురంరూరల్, అక్టోబరు24(ఆంధ్రజ్యోతి):బండారులంక గ్రామంలో డంపింగ్ యార్డు ఏర్పాటుచేసి చెత్తను తొలగించాలని డిమాండ్ చేస్తూ చేపట్టిన రిలే నిరాహార దీక్షలు ఎనిమిదో రోజుకు చేరుకున్నాయి. దీక్షా శిబిరంలో ఎంపీటీసీ గుత్తుల జానకీలక్ష్మి, జాన కామేశ్వరరావు, బిళ్ల నాగరాజు, అల్లక మహేష్, అందే చినబాబు, బీరక గంగాధర్ తదితరులు పాల్గొన్నారు. జడ్పీటీసీ పందిరి శ్రీహరి, నాయకులు తోరం గౌతమ్, మిండగుదటి మోహన్, ఎంపీటీసీ కామిశెట్టి కుసుమ-శ్రీనివాసరావు, సరెళ్ల రామకృష్ణ, కట్టా చండీప్రియ, గుమ్మడి రాజశ్రీ, గుత్తుల సత్తిబాబు, గుత్తుల మురుగులరాజు, ఊటుకూరి సుబ్రహ్మణ్యేశ్వరస్వామి, వాసా దొరబాబు, యినుమర్తి లింగమూర్తి, లక్కింశెట్టి ఫణిరాజు, చింతా ఉమామహేశ్వరరావు, గోసంగి శ్రీను, సరెళ్ల నాగమల్లేశ్వరరావు తదితరులు దీక్షా శిబిరాన్ని సందర్శించి సంఘీభావం తెలిపారు.

ఆందోళనకారులతో అధికారుల సమావేశం..

చెత్త సమస్యను పరిష్కరించాలని చేపట్టిన రిలే నిరాహార దీక్షా శిబిరాన్ని జిల్లా పంచాయతీ అధికారి శాంతలక్ష్మి సందర్శించారు. అనంతరం పంచాయతీ కార్యాలయంలో సర్పంచ్ పెనుమాల సునీత అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. చెత్తను శాశ్వతంగా తొలగించి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపించాలని డీపీవో పి.శాంతలక్ష్మి దృష్టికి తీసుకువచ్చారు.సమావేశంలో డీఎల్పీవో పి.బొజ్జిరాజు, డీఎల్డీవో వేణుగోపాల్, డిప్యూటీ ఎంపీడీవో శాస్త్రి, మరో డిప్యూటీ ఎంపీడీవో రుద్రరాజు ఎస్ఎస్ సూరపరాజు, కార్యదర్శి కోరుమిల్లి శ్రీనివాస్ పాల్గొన్నారు. అనంతరం దీక్షా శిబిరాన్ని విచ్చేసిన డీపీవో తడిచెత్త పొడిచెత్తను వేరుచేసే విధంగా చర్యలు తీసుకుంటున్నామని దీక్షాదారులకు వివరించారు. అయితే గ్రామంలో చెత్త సమస్యను పూర్తిగా పరిష్కరించాలని వార్డు సభ్యులు అంకం పెదరాజు, జాన గణేష్, కూర్మ క్రీస్తుబాబు తదితరులు పట్టుబట్టారు. దాంతో సమస్యను కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారానికి చర్యలు తీసుకుని పరిష్కరిస్తామని డీపీవో పేర్కొన్నారు.

విద్యుత్ సమస్యలు పరిష్కరించాలి

మలికిపురం, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): రాజోలు నియోజకవర్గంలో విద్యుత్ సమస్యలు లేకుండా సహకరించాలని తూర్పుప్రాంత విద్యుత్ సంస్థ డైరెక్టర్ టీవీ సూర్యప్రకాష్‌ను ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ కోరారు. విశ్వేశ్వరాయపురంలో ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం వద్ద ఎమ్మెల్యే దేవను మర్యాద పూర్వకంగా ఆయన కలిశారు. ఈసందర్భంగా రాజోలు నియోజకవర్గ విద్యుత్ సమస్యలపై వారు మాట్లాడారు. వచ్చే ఐదు నెలల్లో సింగిల్ ఫేజ్ కరెంట్‌ను త్రీఫేజ్ కరెంట్‌గా మార్పు చేస్తున్నామని సూర్యప్రకాష్ తెలిపారు. దీని వల్ల ట్రాన్స్‌ఫార్మర్లు, కేబుల్ వైర్లు, ఎత్తైన విద్యుత్ స్తంభాలను ఏర్పాటు చేస్తామన్నారు. ఆయన వెంట విద్యుత్‌శాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో పారిశుధ్య పనులు

మలికిపురం, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): ఇటీవల కురుస్తున్న వర్షాలకు మలికిపురం, సఖినేటిపల్లి మండలాల్లో పలు పల్లపు ప్రాంతాలు జలమయమఅయ్యాయి. రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ సూచనలతో పంచాయతీ అధికారులు గ్రామాల్లో పారిశుధ్యం, ముంపు నీరు తొలగింపు పనులు చేపడుతున్నారు. పల్లపు ప్రాంతాల్లోని మురుగునీరు పోయే విధంగా మోరి, మోరిపోడు గ్రామాల్లో ఆయా సర్పంచ్‌ల ఆధ్వర్యంలో కార్యదర్శులు అనూష, గంగరాజులు చర్యలు చేపట్టారు. పనులను తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షుడు ముప్పర్తి నాని పర్యవేక్షించారు.

నేటి నుంచి రాష్ట్ర స్థాయి పాఠశాలల క్రీడా పోటీలు

యానాం, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): పుదుచ్చేరి రాష్ట్రస్థాయి పాఠశాలల క్రీడా పోటీలు యానాంలో శనివారం నుంచి జరగనున్నాయి. రెండు రోజులు జరిగే పోటీలకు పుదుచ్చేరి, కారైకాల్, మహే నుంచి 400మంది క్రీడాకారులు, 50మంది కోచ్‌లు యానాం వచ్చారు. స్థానిక డాక్టర్ వైఎస్ఆర్ ఇంటర్నేషనల్ ఇండోర్ స్టేడియంలో యానాం విద్యాశాఖ అధికారికారి పంపన లక్ష్మణప్రవీణ్ అధ్యక్షతన జరిగే పోటీలను ప్రభుత్వ డిల్లీ ప్రత్యేక ప్రతినిధి మల్లాడి కృష్ణారావు, ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్, ఆర్‌ఏ అంకిత్‌కుమార్‌లు పోటీలను ప్రారంభించనున్నారు. బాస్కెట్‌బాల్, బ్యాడ్మింటన్, వాలీబాల్, కోకో పోటీలు నిర్వహించనున్నారు. క్రీడాకారులకు మల్లాడి కృష్ణారావు భోజనం ఏర్పాటుచేశారు. పాఠశాలలో బసచేసిన క్రీడాకారులకు మల్లాడి భోజనాలు వడ్డించారు.



క్రీడాకారులకు భోజనాలు వడ్డిస్తున్న మల్లాడి

ముంపు తీర ప్రాంతాలను పరిశీలించిన ఎమ్మెల్యే దేవ

అంతర్వేది, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): డ్రెయిన్లు ఆక్రమణలకు గురికావడంతో తీర ప్రాంత గ్రామాలు నిత్యం ముంపునకు గురవుతున్నాని ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ అన్నారు. కేశవదాసుపాలెం గ్రామంలో ఎమ్మెల్యే దేవ వరప్రసాద్, టీడీపీ ఇన్‌చార్జి గొల్లపల్లి అమూల్యు నాయకులతో కలిసి ముంపు ప్రాంతాలను పరిశీలించారు. మెండుపాలెం, అగస్టీన్ కాలనీలను కూటమి నాయకులతో కలిసి పరిశీలించారు. ప్రజల ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు. ముంపునీటిని త్వరితగతిన తరలించే విధంగా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఇంజన్ల సాయంతో ఇళ్ల చుట్టూ చేరిన నీటిని తరలించాలని పంచాయతీ, రెవెన్యూ అధికారులను ఆదేశించారు. అనంతరం శానిటేషన్, తాగునీటిపై దృష్టి సారించాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో బీసీ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ గుబ్బల ఫణికుమార్, గెడ్డం మహలక్ష్మిప్రసాద్, ముప్పర్తి నాని, ఉండపల్లి అంజి, బెల్లంకొండ పుత్రయ్య, జిల్లెల్ల రక్షక్, యెనుముల సింహాచలం, కూటమి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

శ్రీసత్యసాయి సామూహిక వ్రతాలు

అమలాపురం టౌన్, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): భగవాన్ శ్రీసత్యసాయిబాబా శతవర్ష జన్మదిన మహోత్సవాల్లో భాగంగా శుక్రవారం అమలాపురం శ్రీసత్యసాయి కల్యాణ మండపంలో సామూహిక శ్రీసత్యసాయి వ్రతాలు నిర్వహించారు. దిట్టకవి శ్రీనివాసాచార్యులు ఆచార్య బ్రహ్మత్వంలో 270మంది భక్తులతో సామూహిక శ్రీసత్యసాయి వ్రతాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. కార్యక్రమంలో శ్రీసత్యసాయి సేవాసమితి జిల్లాశాఖ అధ్యక్షుడు అడబాల కొండబాబు, జోనల్ ఇన్‌చార్జి, ఈఎన్‌టీ వైద్య నిపుణుడు డాక్టర్ జి.ప్రభాకరరాజు, పెన్మెత్స రామరాజు, మన్యం పర్వతవర్ధనరావు, నడింపల్లి శ్రీనివాసరాజు, అడపా రాంబాబు, భవానీ, శిష్టా గునరంజన్‌తో పాటు సత్యసాయి కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ పోటీల్లో ప్రతిభ

అమలాపురం రూరల్, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): స్కూలు గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో నిర్వహించిన పలు పోటీల్లో కామనగరువు ఆదిత్య ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రతిభ చాటి డివిజన్ స్థాయి పోటీలకు ఎంపికైనట్టు పాఠశాల ప్రిన్సిపాల్ రాంప్రసాద్ తెలిపారు. అండర్-14, అండర్-17 విభాగాల్లో వివిధ పోటీల్లో 15మంది విద్యార్థులు ప్రతిభ చాటి డివిజన్ స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. వారిని ఆదిత్య విద్యాసంస్థల చైర్మన్ నల్లమిల్లి శేషారెడ్డి, డైరెక్టర్ ఎన్.శృతిరెడ్డి, జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ పీఎస్‌పీఎస్ చలపతిరావు, వైస్ ప్రిన్సిపాల్ జి.సుధ పాల్గొని అభినందించారు. విద్యార్థులను క్రీడాకారులుగా తీర్చిదిద్దిన పీఈటీలు కె.విజయకృష్ణ, జి.వెంకటశివ, ఎ.భవానీలను అభినందించారు.

ముంపునకు గురైన అంతర్వేది తీరప్రాంతం

అంతర్వేది, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షాలకు సఖినేటిపల్లి మండలంలో చాలా గ్రామాలు ముంపునకు గురయ్యాయి. అంతర్వేది, దేవస్థానం, పల్లిపాలెం, కేశవదాసుపాలెం గ్రామాలు జలమయమయ్యాయి. ఇటీవల అంతర్వేది లక్ష్మీనరసింహస్వామివారి ఆలయానికి కోట్ల రూపాయలతో నూతనంగా నిర్మించిన రహదారి ఎల్ఎఫ్ చానల్ సమాంతరంగా నీట మునిగింది. అంతర్వేది ఆలయానికి వెళ్లే భక్తులు వెళ్లే ప్రధాన రహదారి నీట మునిగింది. తీరప్రాంత ప్రజల్లో భయాందోళన మొదలైంది. ఇప్పటికే ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల ఆవరణలోకి వర్షం నీరుచేరి చెరువులను తలపిస్తున్నాయి. పంటలు పండించకపోయినా పొలాలు, కాల్వలు గోదావరి ప్రవాహంలా నీరు పోటెత్తుతుంది.

పోలియోపై అవగాహన

ముమ్మిడివరం, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): ప్రతీ బిడ్డకు పోలియో టీకా వేయించి పోలియో బారిన పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా వైద్యాధికారి డాక్టర్ ఎం.దుర్గారావుదొర సూచించారు. ప్రపంచ పోలియో దినోత్సవం సందర్భంగా ముమ్మిడివరంలోని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. జిల్లాలో ఉన్న అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ప్రతీ బుధవారం, శనివారం వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమాన్ని నిర్దేశిత ప్రణాళిక ప్రకారం అమలు చేయాలన్నారు. డీఐవో బీవీవీ సత్యనారాయణ మాట్లాడుతూ గ్రామాల్లో పెద్దలు, యువకులను రోటరీ క్లబ్, ఎన్జీవో వంటి సంస్థలను కలుపుకుని ఇతర శాఖల సమన్వయంతో జిల్లాను పోలియో రహిత జిల్లాగా తీర్చిదిద్దేందుకు కృషి చేయాలన్నారు. పోలియో చుక్కలు, టీకాల కార్యక్రమాన్ని విజయవంతంగా పూర్తి చేయాలని వైద్య ఆరోగ్యశాఖ సిబ్బందికి ఆయన సూచించారు.

ఆర్ఏ అంకిత్‌కుమార్‌తో ఎమ్మెల్యే అశోక్ భేటీ

యానాం, అక్టోబరు24(ఆంధ్రజ్యోతి): యానాం నియోజకవర్గంలో పలు చోట్ల రహదారుల మరమ్మతు పనులకు టెండర్లు పూర్తయి వర్క్ ఆర్డర్లు ఇచ్చి నెలలు గడుస్తున్నా ఇప్పటివరకు పనులు ప్రారంభించకపోవడంపై ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్ ఆగ్రహం వ్యక్తంచేశారు. శుక్రవారం ఆర్ఏ అంకిత్‌కుమార్‌ను కలిసి పలు అభివృద్ధి పనులపై ఆయన మాట్లాడారు. పట్టణంలో పలుచోట్ల రహదారులు గోతులతో అధ్వానంగా ఉన్నాయని, మరమ్మతులకు మూడు పనులు చొప్పున టెండర్ల అనంతరం వర్క్ ఆర్డర్లు ఇచ్చారన్నారు. అయితే ఇప్పటివరకు పనులు ప్రారంభంకాకపోవడంతో కురుస్తున్న భారీ వర్షలకు ప్రజలు ప్రమాదాలకు గురవుతున్నారన్నారు.

5 నాటికి అర్హుల జాబితా సర్వే పూర్తి చేయాలి

పి.గన్నవరం, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): ప్రధానమంత్రి ఆవాస్‌యోజన సర్వేను నవంబరు 5వ తేదీ నాటికి పూర్తి చేయాలని ఎంపీడీవో జి.మల్లికార్జునరావు తెలిపారు. స్థానిక మండలపరిషత్ సమావేశ మందిరంలో మండలంలోని ఇంజనీరింగ్ అసిస్టెంట్లతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన ప్రధానమంత్రి ఆవాస్‌యోజన కార్యక్రమంలో భాగంగా ఇంజనీరింగ్ అసిస్టెంట్లు క్షేత్రస్థాయిలో సర్వే నిర్వహించాలన్నారు. ఈనెల25నుంచి వచ్చే నెల 5వ తేదీలోపు లబ్ధిదారుల సర్వేను పూర్తి చేయాలన్నారు. ఈనెల29న గంటి పెదపూడిలో ఆరు, పోతవరంలో4, మానేపల్లిలో 6, వాడ్రేవుపల్లిలో 3, ఉడిమూడిలో 3 నిర్మాణాలు పూర్తయిన ఇళ్లకు ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ ఆధ్వర్యంలో గృహప్రవేశాలు చేస్తామన్నారు. డిప్యూటీ ఎంపీడీవో జి.ఉమామహేశ్వరరావు, ఇన్‌చార్జి ఏఈ కె.శ్రీధర్, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

చిలకమర్తి నియామకంపై బ్రాహ్మణ సమాఖ్య హర్షం

ఐ.పోలవరం, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): మందపల్లి శ్రీమందేశ్వర(శనేశ్వర) స్వామి దేవస్థానం పాలకమండలి సభ్యురాలిగా చిలకమర్తి సావిత్రీశ్రీనివాస్ శుక్రవారం ఎమ్మెల్యే బండారు సత్యానందరావు సమక్షంలో ప్రమాణ స్వీకారం చేశారు. చిలకమర్తి నియామకంపై ఆంధ్రప్రదేశ్ పురోహిత బ్రాహ్మణ సమాఖ్య హర్షం వ్యక్తం చేసింది. రాష్ట్ర వ్యాప్తంగా ఆలయాల్లో బ్రాహ్మణ సామాజిక వర్గానికి ధర్మకర్తల మండలిలో స్థానం కల్పించాలని కూటమి ప్రభుత్వం జీవో జారీ చేసింది. చిలకమర్తి సావిత్రీశ్రీనివాస్‌ను కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు సమక్షంలో పురోహిత బ్రాహ్మణ సమాఖ్య ఆధ్వర్యంలో సన్మానించారు. కార్యక్రమంలో రాష్ట్ర బ్రాహ్మణ సమాఖ్య అధికార ప్రతినిధి నాగభట్ల రవిశర్మ, ఉపాధ్యక్షుడు ఆకొండి మహేష్‌శర్మ, ఎస్.వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఆపదలో ఉన్న ప్రతి కుటుంబాన్ని ఆదుకుంటాం: ఎమ్మెల్యే



సీఎం సహాయనిధి చెక్కును లబ్దిదారుడికి అందిస్తున్న ఎమ్మెల్యే గిడ్డి

పి.గన్నవరం, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా ఆపదలో ఉన్న ప్రతి కుటుంబాన్ని కూటమి ప్రభుత్వం ఆదుకుంటుందని ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ అన్నారు. పి.గన్నవరం జనసేన క్యాంపు కార్యాలయంలో శుక్రవారం 98మందికి రూ.60.16లక్షల సీఎం సహాయనిధి చెక్కులను ఆయన పంపిణీ చేశారు. కూటమి ప్రభుత్వంలో ఇప్పటివరకు నియోజకవర్గంలో 600మందికి 4.80కోట్లు అందించామన్నారు. ఎంపీపీ గనిశెట్టి నాగలక్ష్మి, నగరం మార్కెట్ కమిటీ చైర్మన్ పెనుమాల లక్ష్మి, నీటిపారుదల శాఖ డైరెక్టర్ శిరిగినీడి వెంకటేశ్వరరావు, సొసైటీ చైర్మన్లు సాధనాల శ్రీవెంకటసత్యనారాయణ, పాలూరి ఫణి, చిన్నకాపు, జాలెం శ్రీనివాసరాజు, దొమ్మేటి సాయికృష్ణ, వాసంశెట్టి కుమార్, ఆదిమూలం సూరయ్యకాపు, పప్పుల సాయిబాబు, మద్దుల అనూరాజేశ్వరి, యల్లమిల్లి చిట్టిబాబు, కోట రాజేంద్రప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు పోటీలు

అంబాజీపేట, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): భారత రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా విద్యాశాఖ ఆధ్వర్యంలో మండల స్థాయిలో 8, 9, 10వ తరగతి విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించారు. అంబాజీపేట జిల్లా పరిషత్ హైస్కూల్‌లో ఎంఈవోలు కె.వెంకటేశ్వరరావు, మోకా ప్రకాష్ ఆధ్వర్యంలో పోటీలు నిర్వహించారు. మండలంలో తొమ్మిది పాఠశాలల నుంచి విద్యార్థులు పాల్గొన్నారు. తొండవరం హైస్కూల్‌కు చెందిన శ్రీవనస్వని, అంబాజీపేట హైస్కూల్‌కు చెందిన బి.డింపుల్ సాయివరలక్ష్మి, పుల్లేటికుర్రు జడ్పీ హైస్కూల్‌కు చెందిన సీహెచ్ జయశ్రీలు ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు సాధించినట్లు తెలిపారు. ఈనెల29న జరగబోయే నియోజకవర్గ స్థాయి పోటీలకు ప్రతిభ కనబరిచిన విద్యార్థులు పాల్గొంటారని తెలిపారు. కార్యక్రమంలో హెచ్ఎం సాయిరామ్, ఉపాధ్యాయులు మురళీధర్, ఆనందకుమార్, శేఖర్, సీఆర్పీలు టి.గోవిందరాజు, టి.సత్యనారాయణ, టి.నాగరాజు, ఎం.దుర్గారావు పాల్గొన్నారు.

రాజ్యాంగ అవతరణపై వ్యాసరచన పోటీలు

మామిడికుదురు, అక్టోబరు24(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఉన్నత పాఠశాలల విద్యార్థులకు రాజ్యాంగ అవతరణ దినోత్సవంపై వ్యాసరచన, క్విజ్, డిబేట్ పోటీలను శుక్రవారం నిర్వహించారు. మామిడికుదురు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఇన్‌చార్జి హెచ్ఎం దొంగ సత్యనారాయణ అధ్యక్షతన పోటీలు జరిగాయి. ఈపోటీలను ఎంఈవోలు లక్ష్మీనారాయణ, వెంకన్నబాబు పర్యవేక్షించారు. డిబేట్‌లో కె.సూర్యశర్వాణి, ఎం.కీర్తన, టి.పూజిత, క్విజ్‌లో సీహెచ్ అలివేలుమంగతాయారు. వి.మనోజ్‌శ్రీసాయి, కె.సూర్యశర్వాణి, వ్యాసరచనలో సీహెచ్ అలివేలుమంగతాయారు, వి.మనోజ్ శ్రీసాయి, కె.సిరివెన్నల మొదటి, ద్వితీయ, తృతీయస్థానాలు సాధించారు.

బీటలు వారిన ప్రధాన పంటకాల్వ రక్షణ గోడ



ముమ్మిడివరం, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): భారీ వర్షాలకు బొబ్బర్లంక-పల్లంకుర్రు ప్రధాన పంట కాల్వరక్షణ గోడ బీటలు వారింది. డెల్టా ఆధునికీకరణ పనుల్లో భాగంగా అన్నంపల్లి-కుండలేశ్వరం 9సి ప్యాకేజ్ కింద స్లూయిస్ తలుపుల నిర్మాణం, వంతెన, గట్టు పటిష్టత వంటి అభివృద్ధి పనులకు రూ.23.4కోట్లు కేటాయించారు. ఆ ప్యాకేజీల్లో భాగంగా పనుల్లో 2017-18లో బొబ్బర్లంక-ప్రధాన పంటకాల్వకు కుడివైపున కర్రివానిరేవు పంచాయతీ పరిధిలోని పెన్నాడవారిపాలెం సమీపంలో 40మీటర్లు రక్షణ గోడ నిర్మించారు. అయితే ఇటీవల కురిసిన రక్షణ గోడ వర్షాలకు బీటలు వారింది. దీనిపై ఇరిగేషన్ ఏఈ పవన్‌ను వివరణ కోరగా వర్షాలకు కాల్వగట్టు రక్షణ గోడ కొద్దిగా వాలిందని, అయితే అంత ప్రమాదం లేదని ఆయన వివరణ ఇచ్చారు.

మల్లాడి పరామర్శ

యానాం, అక్టోబరు24(ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ కుటుంబాన్ని ప్రభుత్వ డిల్లీ ప్రత్యేక ప్రతినిధి మల్లాడి కృష్ణారావు పరామర్శించారు. ఈనెల20నయానానికి చెందిన బర్రే సతీష్‌కుమార్, భార్య లలితాదేవి, కుమార్తెలు జెస్సికా, హాయిటీ మోటారుసైకిల్‌పై కాకినాడ నుంచి యానాం వస్తున్నప్పుడు మట్టపాలెం వద్ద మరో మోటారుసైకిల్ ఢీకొట్టింది.సతీష్‌కు కుడి చెయ్యి విరిగింది. కుమార్తె జెస్సీకాకు తలకు తీవ్రగాయం, లలితాదేవిరెండుకాళ్లకు తీవ్రగాయాలయ్యాయి. కాకినాడలోని ఇనోదయ ఆసుపత్రిలో చికిత్సపొందుతున్న వారిని శుక్రవారం మల్లాడి కృష్ణారావు పరామర్శించారు.

మొక్కు తీర్చుకున్న జనసైనికులు

పి.గన్నవరం/రాజోలు, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): గిడ్డి సత్యనారాయణ 2024 ఎన్నికల్లో ఎమ్మెల్యేగా గెలిస్తే అమ్మవారి ఆలయంలో ఒక రోజు అన్నదానం చేస్తామని జనసైనికులైన లంకలగన్నవరం గ్రామానికి చెందిన సోదరులు కొడమంచిలి సూరిబాబు కుమారులు మల్లేశ్వరరావు, సాంబశివ రావు మొక్కుకున్నారు. శుక్రవారం రాజోలు శ్రీవనపులమ్మ, శ్రీకనకదుర్గమ్మ ఆలయంలో ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణతో కలిసి అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించి అనంతరం అన్నదానంలో భక్తులకు భోజనాలు వడ్డించారు.

మహిళల జీవితాల్లో వెలుగులు నింపిన సీఎం చంద్రబాబు

రాజోలు, అక్టోబరు24(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో సీఎం చంద్రబాబు డ్వాక్రా సంఘాలను ప్రారంభించి, మహిళల జీవితాల్లో వెలుగులు నింపారని టీడీపీ రాజోలు నియోజకవర్గ ఇన్‌చార్జి గొల్లపల్లి అమూల్య అన్నారు. ఈసందర్భంగా తాటిపాకలో శుక్రవారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ సీఎం చంద్రబాబుతోనే మహిళా సాధికారిత సాధ్యమన్నారు. మహిళల స్వయం సహాయక సంఘాల సంక్షేమంలో సీఎం చంద్రబాబు మొదటిస్థానంలో ఉంటారని కొనియాడారు. మహిళా సాధికారిత, రుణాలఅందజేత,వ్యాపారాభివృద్ధి అంశాల్లో రాష్ట్రం అగ్రగామిగా నిలిచిందని కేంద్రం ప్రశంసించిందన్నారు.

వ్యక్తికి పాము కాటు

ముమ్మిడివరం, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): లంకాఫ్ ఠాణేలంక గ్రామానికి చెందిన పొద్దోకు అబ్బులు పాముకాటుకు గురయ్యాడు. పశువులు మేపడానికి లంకాఫ్ ఠాణేలంక నుంచి నదీపాయ దాటి లంక భూముల్లోకి వెళ్లిన అబ్బులును పాము కాటువేసింది. ఈవిషయాన్ని అబ్బులు ఫోన్ ద్వారా ఇంటి వద్ద వారికి సమాచారం అందివ్వడంతో వారంతా పడవలో ఇవతలకు తరలించి అక్కడినుంచి 108లో ముమ్మిడివరం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉన్నట్టు ఆసుపత్రి వైద్యులు తెలిపారు.

మండపేట

• కొత్తపేట • మండపేట • రామచంద్రపురం



కపిలేశ్వరపురంలో నేలనంటిన వరి చేను

నేలనంటిన వరి చేలు

● పొంగిపొర్లుతున్న డ్రెన్లు

● లోతట్టు ప్రాంతాలు జలమయం

● దిక్కుతోచని స్థితిలో రైతన్న

కపిలేశ్వరపురం, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): ఇటీవల కురుస్తున్న భారీ వర్షాలకు మండలం లోని పలు గ్రామాల పరిధిలోని వరిచేలు నేల నంటాయి. పంట చేతికొచ్చే సమయంలో వర్షా లు కురవడంతో అన్నదాతలు ఆందోళన చెం దుతున్నారు. ఆరుగాలం కష్టించి అప్పులుచేసి పం డించిన పంట చేతికందే వేళల్లో పంట ముం పునకు గురవడంతో రైతులు దిక్కుతోచనిస్థితిలో కొట్టుమిట్టాడుతున్నారు.శుక్రవారం కూడా వీడని వర్షంతో జనాలు బయటకు వెళ్లి నిత్యావసరాలు తెచ్చుకునే పరిస్థితి లేకుండాపోయింది. పలు చోట్ల పల్లపుప్రాంతాల్లో చేరిన వర్షపునీరుతో ని ర్వాసితులు ఇబ్బందులు పడుతున్నారు. డ్రెన్లు పొంగిపొర్లడంతో రోడ్లపైకి వర్షపునీరు చేరి ప్ర యాణికులకు ఇబ్బందిగా మారింది. అకాలవర్షా లకు పంటలు పాడైపోవడంతో రైతులు దిగా లు చెందుతున్నారు. అన్నదాతలను ప్రభుత్వం ఆదుకోకపోతే ఆత్మహత్యలకు దారితీసే పరిస్థితి వస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

వర్షాలతో రైతుల ఆందోళన

రాయవరం(ఆంధ్రజ్యోతి): గతమూడు రోజులుగా కురుస్తున్న వర్షాలకు మండలంలోని పలు గ్రామాల్లో వరిచేను నేలవాలడంతో రైతులు ఆం దోళన చెందుతున్నారు. మండలంలోని వివి ధ గ్రామాల్లో విద్యుత్ మోటార్లు, బోర్లు ఉపయో గించిన ముందుగా వరినాట్లు వేసిన పొలాలు మరో 10నుంచి 20 రోజుల్లో కోతదశకు రానున్నా యి. ఈనేపథ్యంలో మూడు రోజల పాటు ఎడ తెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు పలుచోట్ల వరిచేను నేలవాలింది. వరిపొలాలు ఈనిక దశ లో ఉన్నాయని వర్షాలకు పంటలు పాడైపోతా యని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

అల్పపీడన ద్రోణితో వరి పంటకు నష్టం

ఆత్రేయపురం(ఆంధ్రజ్యోతి): అల్పపీడన ప్ర భావ ద్రోణితో నాలుగు రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాలకు ఈదురుగా లులకు వరి పంటకు అపార నష్టం చేకూరింది. 17 గ్రామాల్లో రైతులు వరిసాగును విస్తారంగా చేపట్టారు. వాయిగుండం కారణంగా చేతికి అందినపంట నేలకొరగడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. కష్టించి పండించిన పంట చేతికి వస్తున్న తరుణంలో నీట మునగడంతో రైతుల ఆశలు ఆవిరయ్యాయి. పంటపొలాలను చూస్తున్న రైతులు దిక్కుతోచనిస్థితిలో కొట్టిమి ట్టాడుతున్నారు. కుంభవృష్టితో కురుస్తున్న వర్షా లకు లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. డ్రైనేజీ వ్యవస్థ సక్రమంగా లేకపోవడంతో రోడ్ల మీద, పంటపొలాల్లో ముంపునీరు బయటకు వెళ్లే మార్గం కనిపించక రైతులు ఇబ్బందులు పడుతున్నారు.



ఆత్రేయపురంలో పడిపోయిన చేలు



ఏడిదలో వర్షాలకు నెలవాలిన వరి పొలాలను పరిశీలిస్తున్న వ్యవసాయా ధికారితోపాటు కూటమి నేతలు

వరి కోతలు వాయిదా వేసుకోవాలి

● రైతులకు వ్యవసాయాధికారి సూచన

మండపేట, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): నాలుగు రోజుల నుంచి కురుస్తున్న భారీ వ ర్షాల నేపథ్యంలో దెబ్బతిన్న వరి పొలాలను మండపేట మండల వ్యవసాయాధికారి ప్ర భాకర్ శుక్రవారం పరిశీలించారు. ఆయన ఏడిదలో నేలకు వాలిన వరి పంటను స్థానిక రైతులు కూటమి నేతలతో కలిసి పరిశీలించా రు. నెలకు వాలిన వరి పంట విషయంలో తీ సుకోవాల్సిన జాగ్రత్తలగురించి ఆయన రైతు లకు పలు సూచనలు చేశారు. వర్షాలు నేప థ్యంలో వరికోతలు వాయిదా వేసుకోవాల ని ఆయన రైతులకు సూచించారు. పొలాల నుంచి ముంపునీరు బయటకు వెళ్లేలా రైతు లు బాటలు వేసుకోవాలని సూచించారు. వరి కంకులు రంగు మారకుండా ఉప్పునీ టిని పిచికారీ చేయాలని ఆయన సూచించారు. పంటను కోసిన వరి పనలపై ఉప్పునీటి ద్రా వణాన్ని చల్లాలన్నారు. ముంపులో ఉన్న వరిపనలు రెండు మూడు రోజులు వ్యవధిలో రంగు మారుతుందని ఆయన చెప్పారు. నీ టిని పొలం నుంచి బయటకు పంపిన తర్వా త కార్బనిజం రెండు గ్రాములు, లేదా ప్రొపె నోకోనజల్ 1మిల్లీ లీటర్ నీటిని కలిపి బాగా తడిచేలా పిచికారీ చేయాలని ఆయన రైతు లకు సూచించారు. గింజదశ పాలుపో సుకు నే దశలో పంటఉంటే పంట బరువు పెరిగి వరి నేలకు వాలిపోయే ప్రమాదం ఉంద న్నా రు. పొలాల్లో ముంపునకుగురైన వరి కంకు లు రంగుమారి మొలకలు వచ్చే ప్రమాదం ఉందన్నారు. ఐదుశాతం ఉప్పునీటి ద్రావణం పిచికారీ చేసి పంటను కాపాడుకోవాలని ఆ యన కోరారు. ఏవో వెంట సహకార సంఘం అధ్యక్షుడు గొడవర్తి సత్యనారాయణమూర్తి, జేజిబాబు, వీర్రాజు, రైతులు పాల్గొన్నారు.

చెముడులంకలో వృద్ధుడి నేత్రదానం

ఆలమూరు, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): మండలంలోని చెముడులంకకు చెందిన చో డపనీడి వీర్రాజు(81) నేత్రదానం చేశారు. వృ ద్ధాప్యంతో మృతిచెందిన వీర్రాజు భార్య సర స్వతి తన భర్త నేత్రాలు దానం చేయాలని ప ట్టుపట్టడంతో వారి కుటుంబ సభ్యులు నిడ దవోలు రాజశ్రీ రామకృష్ణన్ నేత్ర వైద్యశాలకు సమాచారం ఇచ్చారు. లయన్స్‌క్లబ్ ప్ర తిని ధులు చెముడులంక వచ్చి నేత్రాలు సేకరిం చారు. వీర్రాజు కుటుంబ సభ్యులను గ్రామస్థు లు అభినందించారు.

డిప్యూటీ ఎంపీడీవోగా శంకరుడు బాధ్యతల స్వీకరణ

కె.గంగవరం, అక్టోబరు24(ఆంధ్రజ్యోతి): కె. గంగవరం మండల డిప్యూటీ ఎంపీడీవోగా భవానీ శంకరుడు శుక్రవారం బాధ్యతలు స్వీ కరించారు. ఎంపీడీవో కార్యాలయం పరిపాల నాధికారి సురేంద్రరెడ్డికి ఆయన ఈ మేరకు ఉత్తర్వులు అందజేశారు. డిప్యూటీ ఎంపీడీవో గా బాధ్యతలు స్వీకరించిన భవానీ శంకరు డుకు గ్రామకార్యదర్శుల సంఘం నాయకులు ముద్రగడ చంటి, కె.వి.వి.సత్యనారాయణ, గౌరీ శంకర్ తదితరులు అభినందనలు తెలిపారు.

ప్రజారోగ్య పరిరక్షణకు ప్రభుత్వం కృషి

●మెగా వైద్య శిబిరాన్ని ప్రారంభించిన మంత్రి సుభాష్

కె.గంగవరం, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): ఆరో గ్యానికి మించిన సంపద మరొకటి లేదని ప్రజా రోగ్య పరరక్షణకు కూటమి ప్రభుత్వం కృషిచే స్తుందని కార్మికశాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ అన్నారు. మండల కేంద్రం కె.గంగవరంలో శుక్ర వారం పైప్‌లైన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ లిమిటెడ్, టీట్రీ హస్పిటల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మెగా ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. దీనిని మంత్రి సు భాష్ ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో ఆయన మాట్లాడారు. నియోజకవర్గంలో ప్రజలందరూ ఆరోగ్యంగా ఉండాలనే ఆశయంతో ఆరోగ్య రామచంద్రపురం లక్ష్యంగా పలు ఆరోగ్య సేవా కార్యక్రమాలు చేపడుతున్నామని చెప్పా రు. సత్యం ఫౌండేషన్ చైర్మన్ వాసంశెట్టి సత్యం మాట్లాడుతూ ఆరోగ్యమే మహాభాగ్యం అనే నినాదంతో ప్రభుత్వం వైద్యరంగం బలోపేతానికి కృషి చేస్తుందన్నారు. వైద్యశిబిరంలో పలు రకాల క్యాన్సర్ వైద్య పరీక్షలు, కంటి పరీక్షలు, డిజిటల్ ఎక్సరే వంటి పలు రకాలు పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జనసేన ఇన్‌ఛార్జ్ పోలిశెట్టి చంద్రశేఖర్, ఏఎంసీ చైర్మన్ అక్కల రిష్వంత్‌రాయ్, స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ డైరెక్టర్ సలాది రమేష్, పిల్ ఎండి అఖిల్ మల్హోత్ర, సీఈవో ప్రదీప్ చౌహాన్, హెడ్ కె. దివాకర్, సీనియర్ జీఎం కె. ప్రసాద్, చక్రవర్తి, జనసేన మండల అధ్యక్షుడు చిర్రా రాజ్‌కుమార్, సొసైటీ అధ్యక్షుడు నేమాని సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.



:సీఎం సహాయనిధి చెక్కులు పంపిణీ చేస్తున్న మంత్రి సుభాష్

సీఎం సహాయనిధి చెక్కుల పంపిణీ

రామచంద్రపురం(ద్రాక్షారామ),అక్టోబరు24 (ఆంధ్రజ్యోతి):సీఎం సహాయనిధి నుంచి మం జూరైన చెక్కులను శుక్రవారం మంత్రి సుభాష్ స్థానిక క్యాంపుకార్యాలయంలో పంపిణీ చేశారు. 19 మంది లబ్ధిదారులకు రూ.17.40లక్షల చెకు కలు మంత్రి సుభాష్ అందజేశారు. కార్యక్రమం లో సత్యంవాసంశెట్టి ఫౌండేషన్ చైర్మన్ వాసం శెట్టి సత్యం, టీడీపీ పట్టణ అధ్యక్షుడు ఉండవిల్లి శివ, కె.గంగవరం మండల అధ్యక్షుడు మేడిశెట్టి రవికుమార్, మాజీ కౌన్సిలర్ దంగేటి గౌరీశంకర్, మాజీ ఎంపీటీసీ విత్తనాల వెంకటరమణ, రామ చంద్రపురం మండల పార్టీ అధ్యక్షు డు కొత్తపల్లి శ్రీను, కంచుమర్తి బాబూరావు, మాజీ కౌన్సిలర్ వైట్ల సూర్యప్రకాశరావు, వనుం వీరబ్రహ్మం, బాధిత కుటుంబాల సభ్యులు పాల్గొన్నారు.



మందపల్లి మందేశ్వర (శనేశ్వర) ఆలయ పాలకమండలి ప్రమాణస్వీకార దృశ్యం

పాలక మండలి ఆలయ అభివృద్ధికి కృషిచేయాలి

● కొత్తపేట ఎమ్మెల్యే బండారు

కొత్తపేట, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): దేశం లోని ప్రసిద్ధిచెందిన మందపల్లి మందేశ్వర(శనే శ్వర) ఆలయం పాలకమండలి సభ్యులుగా ని యమితులైన వారు ఆలయ అభివృద్ధికి కృషిచే యాలని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానం దరావు పేర్కొన్నారు. శుక్రవారం కొత్తపేట మం డలం మందపల్లి శనేశ్వర ఆలయం వద్ద జరి గిన నూతన పాలకమండలి ప్రమాణస్వీకారోత్స వానికి ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా దేవస్థానం అర్చకులు, వేదపడి ంతులు స్వాగతం పలికి శేషవస్త్రంతో సత్కరిం చి వేదాశీర్వచనం అందించారు. అనంతరం నూతన ధర్మకర్తల మండలి సభ్యులుగా గంధం సత్యవెంకట నాగాజీ, దంగేటి సాయి నాగభూ షణం, నేరేడుమిల్లి మహాలక్ష్మి, గవర వీరవెం కట సత్యనారాయణ, చిలకమర్తి అనంతలక్ష్మిసా విత్రి, దేవపాటి వెంకటేశ్వరరావు, కొత్తపల్లి శిరో నాగమణి, తణుకు వీరభద్రరరావు, కముజు స్వ ప్న, ఐలూరి శ్రీరామమూర్తిలచే ప్రమాణ స్వీకా రం చేయించారు. అనంతరం ఎమ్మెల్యే బండా రు మాట్లాడుతూ రాష్ట్ర నలుమూలల నుంచి ఈ దేవాలయ సందర్శనకు భక్తులు వస్తుంటా రని వారికి తగిన సౌకర్యాల కల్పనకు తనతో పాటు పాలకమండలి కృషిచేయాలన్నారు. అ నంతరం రూ.30లక్షల వ్యయంతో నిర్మించిన 28 స్నానపు గదుల సముదాయాన్ని ఆయన ప్రా రంభించారు. కార్యక్రమంలో జనసేన నియోజక వర్గ ఇన్‌చార్జ్ బండారు శ్రీనివాస్, బీజేపీ ఇన్‌చా ర్జ్ పాలూరి సత్యానందం, చింతం విజయకృష్ణ మోహన్, సిద్ధంశెట్టి వీరవెంకట సత్యనారా యణ, ధరణాల రామకృష్ణ, కంఠంశెట్టి శ్రీనివా స్, ముత్యాల బాబ్జి, తులా రాజు, కంఠంశెట్టి స త్యప్రసాద్ పాల్గొన్నారు

అభివృద్ధి చూసి ఓర్వలేకే వైసీపీ కుట్రలు

రావులపాలెం, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి చేస్తున్న అభివృద్ధిని చూసి ఓర్వలేకే వైసీ పీ కుట్రలు, కుతంత్రాలకు పాల్పడుతున్నారని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు అన్నారు. రావులపాలెం క్యాంపు పార్టీ కార్యా లయంవద్ద ఏర్పాటుచేసిన విలేకర్ల సమావే శంలో ఆయన మాట్లాడారు. అమరావతి నిర్మా ణం శరవేగంగా జరగడంతోపాటు విశాఖకు గూగుల్ వస్తుండటంతో వైసీపీ నేతలు జీర్ణిం చుకోలేకపోతున్నారన్నారు. దీంతో కులాలు, మ తాల మధ్య విద్వేషాలు సృష్టించి దుష్ప్రచారాల తో ప్రజలు తప్పుదోవ పట్టించేందుకు వైసీ పీ పాల్పడుతుందన్నారు. రూ.3500 కోట్ల అక్ర మ మద్యం కేసులలో జగన్ అండ్‌కో ఇరుక్కు న్న సంగతి ప్రజలందరికీ తెలుసునన్నారు. మాజీ ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి నిరాధార ఆరోపణలు చేస్తున్నారని అలాంటి చిల్లర మాటలకు నేను స్పందించాల్సిన అవసరంలేదన్నారు. వైసీపీ నేత లకు మద్యంషాపులు ఉన్నాయని వారు కూడా అధిక ధరలకు మద్యం విక్రయిస్తున్నారని ఎద్దేవా చేశారు. లొల్ల లాకుల పునర్నిర్మాణానికి, కొత్తపేట ఆర్డీవో కార్యాలయం మార్కెట్‌యార్డు స్థలంలో నిర్మించేందుకు సీఎం చంద్రబాబు సానుకూలంగా స్పందించారన్నారు. రావులపా లెం-వాడపల్లి రహదారి నిర్మాణానికి డిప్యూటీ సీఎం పవన్ రూ.6కోట్లు నిధులు మంజూరు చేశారన్నారు.

ప్రమాదంపై దిగ్భ్రాంతి

కర్నూల్‌వద్ద ప్రవేట్ ట్రావెల్ బస్సు దగ్ధమైన ప్రమాదంపై ఎమ్మెల్యే బండారు సత్యానందరా వు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. రావులపా లానికి చెందిన వ్యక్తి మరణించడంపై ఆయన సానుభూతి వ్యక్తం చేశారు.

ప్రజాసమస్యల పరిష్కారానికి కృషి

సామాన్య ప్రజల సమస్యల పరిష్కారానికి కూటమి ప్రభుత్వం కృషిచేస్తుందని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు అన్నారు. రావులపాలెం టీడీపీ క్యాంపు పార్టీ కార్యాల యం వద్ద శుక్రవారం ఎమ్మెల్యే ప్రజాదర్బార్ కా ర్యక్రమం నిర్వహించారు. ప్రజల వద్ద నుంచి 34 వినతులు స్వీకరించి వాటి పరిష్కారానికి అధికారులకు పంపించామన్నారు.

సురక్ష యాప్‌ను వినియోగించుకోవాలి



రావులపాలెంలోని మద్యం దుకాణం వద్ద క్యూఆర్ కోడ్‌పై అవగాహన కల్పిస్తున్న ఎమ్మెల్యే సత్యానందరావు

రావులపాలెం, అక్టోబరు24(ఆంధ్రజ్యోతి): మ ద్యం వినియోగదారులు సురక్ష యాప్‌ను విని యోగించుకోవాలని కొత్తపేట ఎమ్మెల్యే బండా రు సత్యానందరావు అన్నారు. రావులపాలెం రింగ్‌రోడ్డులో ఎక్సైజ్‌శాఖ అధికారులతో కలిసి మద్యం షాపులను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కల్తీ మద్యానికి జగన్ పాలనలో నాంది పలికారన్నారు. అది ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడిందన్నారు. మద్యం వినియోగదారుల భద్రత కోసం ప్రభుత్వం తీ సుకువచ్చిన సురక్షయాప్ ద్వారా నాణ్యతను క్యూఆర్ కోడ్ ద్వారా సంపూర్ణంగా తనిఖీ చేసు కోవచ్చునన్నారు. ఎమ్మెల్యే ఓ మద్యం బాటిల్‌పై ఉన్న క్యూఆర్‌కోడ్‌ను స్కాన్‌చేసి మద్యం విని యోగదారులకు వివరాలు చూపించారు. కార్య క్రమంలో ఎక్సైజ్ సూపరిండెంట్ ప్రసాద్, ఎక్సై జ్ సీఐ కాత్యాయని, రాష్ట్ర తెలుగు రైతు ప్రధా న కార్యదర్శి ఆకుల రామకృష్ణ, గుత్తుల రాంబా బు, కంఠంశెట్టి శ్రీనివాస్, గనిశెట్టి వీరేష్, కొప్పూరి అచ్చిరెడ్డి పాల్గొన్నారు.

ద్వారపూడిలో నాగదేవత ప్రతిమ ప్రారంభం

మండపేట, అక్టోబరు24 (ఆంధ్రజ్యోతి): మం డపేట మండలం ద్వారపూడి శివారు పంగిడి చెరువు వద్ద వున్న గ్రామదేవత మసేనమ్మ అమ్మవారి ఆలయ ప్రాంగణంలో గ్రామానికి చెందిన కొత్తపల్లి వీరబాబు తన సొంత నిధులు రూ.70వేలతో నాగదేవత పుట్టను ఏర్పాటు చేశారు. ఆలయంవద్ద ఏర్పాటు చేసిన నాగదేవత ప్రతిమను స్థానిక టీడీపీ నాయ కుడు యరగతపు బాబ్జి శుక్రవారం ప్రారం భించారు. శనివారం నాగుల చవితిని పురష్క రించుకుని గ్రామస్థులు నాగదేవతను దర్శిం చుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించాలని వీరబా బు కోరారు. ఈకార్యక్రమంలో ఆలయ ని ర్వాహకులు కురుపూడి వేంకటేశ్వరరావు, పోకల నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



నాగదేవత మందిరంను ప్రారంభిస్తున్న బాబ్జి

ఆక్వా రైతులు రిజిస్ట్రేషన్ చేయించుకోవాలి

కొత్తపేట, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): కొత్త పేట డివిజన్ పరిధిలో ఆక్వా సాగు చేస్తున్న రైతులు ఆక్వా రిజిస్ట్రేషన్ తప్పనిసరిగా చేయిం చుకోవాలని కొత్తపేట ఆర్డీవో పి.శ్రీకర్ తెలి పారు. శుక్రవారం ఆర్డీవో కార్యాలయంలో మత్స్యశాఖ సహాయ సంచాలకులు, అధికారు లతో ఆయన సమీక్షా సమావేశం నిర్వహిం చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొత్తపేట రెవెన్యూ డివిజన్ పరిధిలో సుమారు 1420 ఎకరాలలో ఆక్వా సాగు చేస్తుండగా కేవలం 563 ఎకరాలకు మాత్రమే ఆక్వా రిజిస్ట్రే షన్ చేయించుకున్నారన్నారు. మిగిలిన 854 ఎకరాలు రిజిస్ట్రేషన్ చేయించుకోవాల్సి ఉందని ఆక్వా రిజిస్ట్రేషన్ చేయించుకోవడం ద్వారా వారికి ప్రభుత్వ పథకాలు విద్యుత్, ఇన్సురెన్స్, బ్యాంకుల నుంచి రుణసదుపాయం, చెరువుల నిర్వహణకు ఉపయోగించే పరికరాలు రాయి తీపై లభిస్తాయన్నారు. అలాగే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రయోజిత పథకాలను పొందగల రని రిజిస్ట్రేషన్ లేకుంటే ఈ పథకాలకు అనర్హులు అవుతారని సూచించారు. సంబంధిత మత్స్యశాఖ అధికారులు రైతులకు అవగాహన కల్పించి ఆక్వా రిజిస్ట్రేషన్ చేయించుకునేలా చేయాలని సూచించారు. సమావేశంలో మత్స్య శాఖ ఏడీ ఎల్‌పీఎస్ వర్ధన్, అధికారులు పాల్గొ న్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీవో శ్రీకర్

నైపుణ్యాలపై ప్రతిఒక్కరూ దృష్టి సారించాలి



విద్యార్థులకు మేకప్ బ్యూటీ సెలూన్‌పై అవగాహన కల్పిస్తున్న దృశ్యం

ఆలమూరు, అక్టోబరు24 (ఆంధ్రజ్యోతి): విద్యార్థి దశ నుంచే నైపు ణ్యాల మెరుగుదలకు ప్రతిఒక్కరూ దృష్టి సారించాలని ఆల మూరు బొబ్బా జయశ్రీ బాలికోన్నత పాఠశాల ప్రధానో పాధ్యా యుడు కె.ఉమ, చెముడులంక ఎస్‌టీఎస్ ఎస్ఎం ఉన్నత పాఠశాల ప్రధా నోపాధ్యాయుడు బి.శివరామ్‌కుమార్ అన్నారు. శుక్రవారం ఆయా పాఠశాలల్లో 9,10 తరగతుల విద్యార్థులకు ఇండస్ట్రియల్ విజిట్ నిర్వహించారు. పాఠశాల విద్యార్థులు మండపేటలోని టోనీ అండ్‌గయ్ ఎసెన్షియల్ బ్రైడల్ మేకప్ బ్యూటీ సెలూన్‌ను సందర్శి ంచి బ్యూటీ కోర్సుమీద అవగాహన పొందారు. చెము డులంక విద్యార్థులు కడియం పల్లవెంకన్ననర్సరీని సందర్శించారు. ఉపాధ్యా యులు గౌతమి, ప్రసన్నకుమారి, శ్రావణి,వి.సూర్యకిరణ్ పాల్గొన్నారు.

వృత్తివిద్యా కోర్సులపై విద్యార్థులకు అవగాహన

మండపేట, అక్టోబరు24(ఆంధ్రజ్యోతి): పాఠశాల స్థాయి నుంచి విద్యార్థులు వృత్తి విద్యాకోర్సులపట్ల అవగాహన కలిగి ఉండాల్సిన అవసరం ఉందని రామచంద్రపురం వీఎస్ఎం కళాశాల అసిస్టెంట్ ప్రొఫెసర్ ప్రవీణ్‌కుమార్ అన్నారు. మండపేట పట్టణంలో వున్న స్థానిక గౌతమి మున్సిపల్ హైస్కూల్లో శుక్రవారం విద్యార్థులకు వృత్తివిద్యాకోర్సులపై ఆయన అవగాహన కార్యక్రమంను నిర్వహిం చారు. వృత్తివిద్యా కోర్సులకు సంబంధించి 9, 10వ తరగతి విద్యార్థు లకు ఆటోమెటివ్, వృత్తివిద్యా కోర్సుల ప్రాధాన్యం గురించి ప్రవీణ్ వివరించారు. ఆటోమొబైల్ కోర్సులు గురించి వివరించారు.

ఘనంగా జాతీయ మోల్ దినోత్సవం

రావులపాలెం, అక్టోబరు24(ఆంధ్రజ్యోతి): రావులపాలెం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జాతీయ మోల్ దినోత్సవం శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ప్రిన్సిపాల్ డాక్టర్‌వి.శ్రీనివాసరావు ఆధ్వర్యంలో చేప ట్టిన కార్యక్రమంలో విద్యార్థులకు క్విజ్ పోటీలు నిర్వహించి బహు మతులు అందజేశారు. మోల్ ప్రాముఖ్యతను వివరించారు. కార్య క్రమంలో అధ్యాపకుడు సత్యవరప్రసాద్, ఐక్యూ ఏసీ కోఆర్డినేటర్ సుభాషిణి, సుమలత, హరిబాబు,సౌజన్య, వెంకటలక్ష్మి పాల్గొన్నారు.

విద్యార్థులకు రెయిన్ కోట్లు అందజేత

ఆలమూరు, అక్టోబరు24(ఆంధ్రజ్యోతి): చింతలూరు ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు ఆలమూరు మండల అభివృద్ధి అధికారి ఏ.రాజు, మండల విద్యాశాఖ అధికారి బి.అప్పాజీ రెయిన్ కోట్లు అం దజేశారు. చింతలూరు పాఠశాల విద్యార్థులు చేసే బోధన కృత్యా లు, సామాజిక సందేశ వీడియోలు సోషల్ మీడియాలో చూసి ఏడిద గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు వాసంశెట్టి శేష్‌కు మార్, విద్యార్థులకు రెయిన్ కోట్లు బహూకరించారు. ఈ కార్యక్ర మంలో చింతలూరు టీడీపీ గ్రామ అధ్యక్షుడు వైట్ల గంగరాజు, మధ్యాహ్న భోజనం పథకంకు అవసరమైన మిక్సీని బహూ కరిం చారు. దాతలను ఎంపీడీవో రాజు అభినందించారు.


టీడీపీలో చేరిన వైసీపీ ఎంపీటీసీ భాస్కరరావు



ఎంపీటీసీ భాస్కరరావును పార్టీ కండువాతో ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే వేగుళ్ల

కపిలేశ్వరపురం, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): మండలకేంద్ర మైన కపిలేశ్వరపురం గ్రామ ఎంపీటీసీ-2 శీలం భాస్కరరావు శుక్రవారం వైసీపీ నుంచి టీడీపీలో చేరారు. ఆగ్రామ టీడీపీ నాయకులు నెక్కంటి శ్రీరాంజీ, గ్రామసర్పంచ్ సాకా శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఆయన మండపేట టీడీపీ కార్యాలయంలో రాష్ట్ర అంచనాల కమిటీ చైర్మన్, ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు సమ క్షంలో టీడీపీలో చేరినట్లు భాస్కరరావు తెలిపారు. ఈ సంద ర్భంగా ఎమ్మెల్యే భాస్కరరావును పార్టీ కండువాను కప్పి పార్టీలో సాదరంగా ఆహ్వానించారు.

వెంకన్న ఆలయంలో ఎస్సీ కమిషన్ చైర్మన్ పూజలు



జవహర్‌కు స్వామివారి చిత్రపటం అందిస్తున్న దృశ్యం

ఆత్రేయపురం, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): కోన సీమ తిరుపతిగా పేరొందిన వాడ పల్లి శ్రీదేవి భూదే వి సమేత శ్రీ వేంక టేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం రాష్ట్ర ఎస్సీ కమిషన్ చైర్మన్ కేఎస్ జవహర్ స్వామివారిని దర్శించుకున్నారు. తొలు తగా అర్చక బృందం పూర్ణకుంభంతో ఘనస్వాగతం పలికారు. ప్రొటోకాల్ ప్రకారం తహసీల్దారు పి.రాజేశ్వరరావు చైర్మన్‌కు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. అనంతరం బంధుమి త్రులతో స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ముఖమండపంలో వేదపడింతులు ఆశీర్వచనం తీర్థప్రసాదాలు అందించారు. ఆలయ చైర్మన్ ముదునూరి వెంకట్రాజు, ఉపకమి షనరు నల్లం సూర్యచక్రధరరావు శేషవస్త్రం సమర్పించి స్వామి వారి చిత్రపటం అందజేశారు.

మండపేట రూరల్ తహసీల్దార్ కార్యాలయం ఏర్పాటు చేయాలి

● వైస్ ఎంపీపీ పసుమర్తి డిమాండ్

మండపేట, అక్టోబరు 24,(ఆంధ్రజ్యోతి): మండపేటలో వున్న మండల తహసీల్దార్ కార్యాలయం స్థానే మండపేట రూరల్ రెవెన్యూ కార్యాలయంను నూతనంగా ఏర్పాటుచేయాలని మండ పేట మండల వైస్ ఎంపీపీ పసుమర్తి నాగేశ్వరరావు ప్రభుత్వం ను డిమాండ్ చేశారు. పెరుగుతున్న జనాబా ప్రజల అవసరార్థం మండపేట పట్టణంతోపాటు మండపేటరూరల్ గ్రామాలు ఉండటంవల్ల రూరల్ తహసీల్దార్ కార్యాలయ ఏర్పాటు చేయా ల్సిన అవసరం ఉందని ఆయన అన్నారు. ఈమేరకు స్థానిక ఎమ్మెల్యే రాష్ట్ర అంచనాల కమిటీ చైర్మన్ వేగుళ్ల జోగేశ్వరరావు ప్రత్యేక దృష్టి సారించాలని కోరారు.

కర్నూలులో బస్ ప్రమాదం బాధాకరం : ఎమ్మెల్యే వేగుళ్ల

మండపేట, అక్టోబరు24(ఆంధ్రజ్యోతి) హైద్రాబాద్‌నుంచి బెంగు ళూరు వెళ్తున్న ప్రైవేట్ బస్సులో శుక్రవారం తెల్లవారు జామున కర్నూలులో జరిగిన ఘోర అగ్నిప్రమాదం సంఘటన పట్ల స్థానిక ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు తీవ్ర దిగ్భ్రాంతిని వ్యక్తం చేశారు. జరిగిన సంఘటన బాధాకరమని ఆయన అన్నారు. మృతులు కు టుంబాలకు ఆయన సంతాపం తెలిపారు.

మృతుల కుటుంబాలకు రూ.50లక్షలు ఇవ్వాలి

హైద్రాబాద్ నుంచి బెంగుళూరు వెళ్తున్న ప్రైవేటు ట్రావెల్ బస్ కర్నూలులో శుక్రవారం జరిగిన అగ్నిప్రమాదంలో మరణించిన మృతుల కుటుంబాలకు రూ.50లక్షలు పరిహారం అందజేయాలని ఏపీ రాష్ట్ర కిసాన్ కాంగ్రెస్‌పార్టీ అధ్యక్షుడు కామన ప్రభాకరరావు ప్రభుత్వంను డిమాండ్ చేశారు.

ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు సంతాపం

హైద్రాబాద్‌నుంచి బెంగుళూరు వెళుతున్న బస్సు ప్రమాదవశా త్తూ కర్నూలులో ప్రమాదంకు గురికావటం అందులో ప్రయా ణిస్తున్న ప్రయాణికులు దుర్మరణం పాలవటం సంఘటన పట్ల వైసీపీ నేత ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు తీవ్ర సంతాపం తెలిపారు.

'నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి'

ద్రాక్షారామ, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): అకాల వర్షాలతో నష్ట పోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని నియోజకవర్గ వైసీపీ ఇన్‌చార్జి పిల్లి సూర్యప్రకాష్ కోరారు. శుక్రవారం రామచంద్రపురం మండలం యనమదల, పట్టణ శివారు ముచ్చిమిల్లి గ్రామాల్లో నీటమునిగిన, నేలనంటిన వరి పొలాలను సూర్యప్రకాష్ పరిశీలిం చారు. ఎంపీపీ అంబటి భవానీ, సర్పంచ్‌లు యల్లమిల్లి సతీష్‌కు మారి, ఎంపీటీసీ శ్రీరామకృష్ణ, ఏడుకొండలు పాల్గొన్నారు.

కోటిసంతకాల సేకరణ

కూటమిప్రభుత్వం ప్రభుత్వ మెడికల్ కాలేజీలను ప్రయివేటీక రించాలన్న కూటమి ప్రభుత్వ నిర్ణయానికి వ్యతిరేకంగా వైసీపీ ఆధ్వర్యంలో శుక్రవారం రామచంద్రపురం పట్టణం కమ్మవారి సావ రంలో కోటి సంతకాల సేకరణ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్ర మంలో నియోజకవర్గ వైసీపీ ఇన్‌చార్జి పిల్లి సూర్యప్రకాష్, పట్టణ వైసీపీ కన్వీనర్ గాదంశెట్టి శ్రీధర్, నాయకులు పాల్గొన్నారు.

అధిక వర్షాలకు రోడ్డుపై పడిన భారీ వృక్షం

కొత్తపేట, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): గత రెండు రోజుల నుం చి కురుస్తున్న ఎడతెరిపిలేని భారీ వర్షాలకు గురువారం అర్ధరాత్రి కొత్తపేట మండలం మోడేకుర్రు శివారు గొలకోటివారిపాలెం వద్ద అమలాపురం- కొత్తపేట ప్రధాన రహదారిపై భారీ వేప వృక్షం పడింది. దీంతో ప్రయాణికులు, వాహనదారులు, తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. అవిడి రేవు మీదుగా ట్రాఫిక్‌ను మళ్లించారు. అయి తే పోలీసులు, అధికారులు సంఘటన స్థలానికి చేరుకుని యుద్ధ ప్రాతిపదికన చెట్టును తొలగించారు.



గొలకోటివారిపాలెం వద్ద ప్రధాన రహదారిపై పడిన భారీ వృక్షం

అన్నదాన పథకానికి రూ.లక్ష విరాళం

ఆత్రేయపురం, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): కోనసీమ తిరుమల వాడపల్లి శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయంలో శుక్రవారం వివిధ ప్రాంతా ల నుంచి వేలాదిగా తరలివచ్చిన భక్తులు స్వామివారి ప్రదక్షిణలు నిర్వహించుకుని దర్శిం చుకున్నారు. ఆలయంలో నిర్వహిస్తున్న నిత్యా న్నదాన పథకానికి సఖినేటిపల్లి మండలం అంతర్వేదికి చెందిన బెల్లంకొండ నాగమల్లేశ్వర రావు-భానుకళ దంపతులు రూ.1,00,116 విరా ళం సమర్పించారు. దాతలకు ఆలయ చైర్మన్ ముదునూరి వెంకట్రాజు, ఉపకమిషనర్, ఈవో నల్లం సూర్యచక్రధరరావు స్వామివారి చిత్ర పటం అందజేశారు.



అన్నదానానికి విరాళం అందిస్తున్న దాతలు

పీఠంలో సౌందర్యలహరి పారాయణం

రాయవరం, అక్టోబరు24(ఆంధ్రజ్యోతి): మం డలంలోని వెదురుపాక విజయదుర్గా పీఠంలో శుక్రవారం సామూహిక సౌందర్యలహరి పారా యణం కార్యక్రమం నిర్వహించారు. హైదరాబా ద్‌కు చెందిన ప్రముఖ ఆధ్యాత్మికవేత్త సుధా స్వామి ఆమె శిష్యబృందం ఆధ్వర్యంలో సౌంద ర్యలహరి సామూహిక పారాయణం నిర్వహిం చారు. తొలుతగా విజయదుర్గా అమ్మవారికి అ ర్చనలు, హారతులు, సామూహిక కుంకుమార్చ నలు చేశారు. అనంతరం పీఠాధిపతి గాడ్ సమక్షంలో సుధాస్వామి ఆధ్వర్యంలో సుమారు 100 మంది శిష్యబృందం సామూహిక సౌంద ర్యల హరి పారాయణం చేశారు. ఈసంద ర్భంగా పీఠాధిపతి గాడ్ మాట్లాడుతూ సౌంద ర్యలహరి పారాయణం చేయడంవల్ల సకల కా ర్యసిద్ధి, సకల శుభాలు కలుగుతాయన్నారు. అనంతరం గాడ్ కుమార్తె సత్యవెంకట కామే శ్వరి సుధాస్వామిని ఘనంగా సత్కరించారు. ఈకార్యక్రమంలో విజయదుర్గా సేవాసమితి ప్రతినిధులు గాదే భాస్కరనారాయణ, బుజ్జి, బలిజేపల్లి రమ, పెదపాటి సత్యకనకదుర్గ, పీఆర్వో బాబి, భక్తులు పాల్గొన్నారు.